ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 25 అక్టోబరు 2024



- ఉచిత గ్యాసు సిలిండర్లతో ప్రజలకు భారీ ఊరట
- గడిచిన ఐదేళ్లలో ప్రజలపై మోయలేని భారం
- భారం కేంద్రానిదైనా రాష్ట్ర ప్రభుత్వ హామీతో ఊరట
- భారాన్ని తగ్గించడం కోసం ఏటా 3 సిలిండర్ల ఉచితం
- 3 జిల్లాల్లో దాదాపు 17 లక్షల మందికి ప్రయోజనం
- ఒక్కో కనెక్షన్‌పై ఏడాదికి రూ. 2500 లబ్ధి



దీపావళి కానుక



గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమను గెలిపిస్తే 'సూపర్ సిక్స్' పథకంలో భాగంగా ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తానని అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రజలకు హామీ యిచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీ నెరవేర నుంది. నాడు 'దీపం' పథకం ద్వారా పేదలకు వంట గ్యాసు కనెక్షన్లు ఇచ్చి వారి ఇళ్లలో వెలుగులు నింపిన టీడీపీ ప్రభుత్వం, ఈ దీపావళికి ఉచిత సిలిండర్లను ప్రజలకు అందించనుంది. ఈ పథకం అమలులోకి రానుండడంతో పేదల ఇళ్లలో 'దీపాల' వెలుగులు రెట్టింపు కానున్నాయి. దీపావళి రోజునే ఈ పథకం ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాల రూపకల్పనకు కసరత్తు చేస్తోంది. ఈ పథకం అమ లుతో ప్రతి నాలుగు నెలలకు ఒక ఉచిత సిలిండర్ పొందవచ్చు.

● విధివిధానాలపై కసరత్తు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 19 లక్షల వంట గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. గుంటూరు జిల్లాలోనే 7 లక్షల కనెక్షన్లు వుండగా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 12లక్షల గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో ఎంతమంది ఈ పథకానికి అర్హులవుతారు. ఎలాంటి విధి విధానాలు రూపొందిస్తే ఎక్కు వ మందికి లబ్ధి చేకూరు తుంది అన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్న తాధికారులు కస రత్తు చేస్తున్నా రు. రాష్ట్రంలో విధిగా నివాసం వుండేవారే ఈ పథ కానికి అర్హులవుతా రు. ఈ పథకం పొందా లంటే గ్యాస్ కనెక్షన్ వుండి, ఆర్థికంగా వెనకబడినవారై ఉండాలి. బీపీఎల్ కు టుంబాలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధానంగా తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారని అధికారులు సూత్రప్రాయంగా చెబుతున్నారు. అయితే, దీనికి సంబంధించి జిల్లా అధికారులకు సమాచారం రావాల్సి వుంది. పూర్తిస్థాయి సమాచారం వస్తే ఈ పథకానికి ఎంత మంది అర్హులు అవుతారనే విషయంపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 17లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసు కుంటే కనుక ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17లక్షల మందికి ప్రభుత్వం ఉచితంగా సిలిండర్లు ఇవ్వాల్సి ఉంటుంది.

● సిలిండర్లు పొందడం ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అక్టోబరు 31వ తేదీన ప్రారంభించనుంది. ఈ నెల 24వ తేదీ నుంచి గ్యాసు బుకింగ్‌లు ప్రారంభించనున్నారు. బుక్ చేసుకున్న వినియోగదారులు సిలిండర్ డెలివరీ సమయంలో మాత్రం సిలిండర్ ధర చెల్లించాల్సి వుంటుంది. ప్రస్తుతం 14.2 కిలోల వంట గ్యాసు సిలిండర్ ధర రూ. 876 వుంది. ఈ మొత్తం వినియోగదారుడు చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రూ. 25 వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమవుతాయి. పోగా మిగిలిన రూ.851ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి రాయితీ కింద ఇస్తుంది.

● గడచిన ఐదేళ్లలో మోయలేని భారం

గృహావసరాల కోసం వినియోగించుకునే వంట గ్యాసు భారం ప్రజలపై మోయలేనంతగా పెరిగింది. గడిచిన పదేళ్లలో ఈ భారం 150 శాతానికి మించి పెరిగింది. గడిచిన ఐదేళ్లలోనే ఈ భారం 100 శాతం పెరిగింది. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు వంట గ్యాసు సిలిండర్ ధర రూ. 436 ఉండగా, అది 2019 నాటికి రూ.706కు పెరగగా, 2021 నాటికి రూ.949కు, 2022 నాటికి రూ. 1,150 నుంచి రూ.1,200 వరకూ వెళ్లడంతో ప్రజలు తారెత్తిపోయారు. వంట గ్యాసు మంటలు దావానలంలా అలముకోవడంతో కేంద్రం దిగివచ్చి, గ్యాసు భారాన్ని కొంత మేర తగ్గించింది. కానీ, గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తగ్గించకపోవడంతో, వంట గ్యాసు ధర రూ. 876గా ఉంది. అయితే, వంట గ్యాసు భారాన్ని మరింత తగ్గించేందుకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్‌లో భాగంగా ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన నాలుగు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. మొత్తంగా ప్రతి ఏటా ఒక్కో కనెక్షన్‌పై రూ. 2,500 లబ్ధి వినియోగదారులకు దక్కనుంది.



ఊపిరి పీల్చుకోండి

వాయు, శబ్ద కాలుష్యాలు పెరిగిపోతున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గుంటూరువాసులు కొంతమేర వాయు కాలుష్యం నుంచి ఉపశమనం పొందుతున్నారు. గతంతో పోలిస్తే వాయు కాలుష్యం కొంత తగ్గిందని కాలుష్య నియంత్రణ అధికారులు ప్రకటించారు. దుమ్ము, ధూళి, పొగ, దుర్వాసన, హారన్ల మోతలు, చెవులు చిల్లులు పడేలా శబ్దాలు.. ఇళ్లలో నుంచి బయటకు వచ్చి రోడ్డెక్కిన ప్రతిఒక్కరికీ ఎదురయ్యే పరిణామాలు. వాయు, శబ్ద కాలుష్యాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామాలు, పట్టణాలతో పోలిస్తే నగర జీవి కాలుష్యాల కాటుకు బలవుతున్నారు. అయితే దేశంలో అధికంగా కాలుష్యం నమోదవుతున్న 132 నగరాలున్న జాబితా నుంచి గుంటూరు ఇప్పుడిప్పుడే బయటపడుతుంది. 2021 నుంచి 2024 ఆగస్టు వరకు వాయు కాలుష్యాన్ని చూస్తే 0.9 శాతం ఎమ్‌జీక్యూక్యూ తగ్గింది. ఇది ప్రస్తుత పరిణామాలతో పోల్చుకుంటే మెరుగేనని అధికారులు చెప్తున్నారు. వాయు కాలుష్యాన్ని ఇంకా తగ్గించి, శబ్ద కాలుష్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు మూడు జిల్లాల పరిధిలో ఒక్క గుంటూరులో మినహా మిగిలిన మున్సిపల్ కేంద్రాల్లో కానీ, జిల్లా కేంద్రాలైన బాపట్ల, నరసరావుపేటల్లో కాలుష్య నియంత్రణపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలున్నాయి. అవగాహనా కార్యక్రమాలతోనే సరిపెడుతున్నారని తమ ప్రాంతాల్లో కూడా కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆయా పట్టణ ప్రజలు కోరుతున్నారు.



గుంటూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద కాలుష్య నమోదు యంత్రం

- గుంటూరులో కాలుష్యం కట్టడి
- సాధారణ స్థాయిలోనే శాతాల నమోదు
- మరింతగా తగ్గాలని కోరుకుంటున్న ప్రజలు
- అధిక కాలుష్య నగరాల జాబితా నుంచి బయటకు
- మిగిలిన పట్టణ ప్రాంతాల్లో అందుబాటులో లేని యంత్రాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలతో సరి

గుంటూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద వాయుకాలుష్య నమోదుయంత్రాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో నమోదైన శాతాలు..

ఏడాది శాతం	(ఎమ్‌జీక్యూక్యూ)
2021	61
2022	60.9
2023	60.3
2024(ఆగస్టుకి)	60.4

6



గుంటూరులో త్వరలో ఏర్పాటుకు సిద్ధమైన కాలుష్యం లెక్కించే యంత్రం

- స్థానిక సంస్థలకు నిలిచిన నిధులు
- తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం
- మూడు మున్సిపాల్టీలు, 69 పంచాయతీలకు ఆగిన నిధులు

ఎన్నికలు జరగలేదని.. ఝలక్



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం స్థానికసంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మూడు మున్సిపాల్టీలు, 69 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. 15వ ఆర్థికసంఘం నిధులు నిలిపేసింది. నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు మున్సిపాల్టీలు రూ.8.91కోట్లు, 69 పంచాయతీలు సుమారు 3.5కోట్లు నిధులను చేజార్చుకున్నాయి. జనాభా ప్రాతిపదికన ఆర్థికసంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం స్థానికసంస్థలకు విడుదల చేస్తుంటుంది. పాలకవర్గాలు ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధన ఉంది. ఫలితంగా పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలైన నరసరావుపేట,

(మిగతా 8వ పేజీలో...)



అధికారులతో చర్చిస్తున్న మంత్రి ఎస్ సవిత

- కృష్ణ పిక్చర్ ప్యాలెస్ స్థలం అభివృద్ధికి ప్రణాళిక
- బ్రాహ్మణ సంక్షేమానికి ఆ స్థలాన్ని వినియోగిస్తాం
- యడవల్లి వారి సత్రాన్ని సందర్శించిన మంత్రి సవిత

అన్యాక్రాంతమైన స్థలాల స్వాధీనం

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో అన్యాక్రాంతమైన స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఎస్ సవిత అధికారులను ఆదేశించారు. యడవల్లివారి సత్రానికి సంబంధించి కృష్ణ పిక్చర్ ప్యాలెస్ స్థలం, జీఎంసీ ఆధీనంలో ఉన్న స్థలాలను, అన్యాక్రాంతమైన మరికొన్ని స్థలాలను క్షేత్రస్థాయిలో గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణ పిక్చర్ ప్యాలెస్ ఉన్న స్థలం అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. థియేటర్ ఉన్న ప్రాంతంలో ఏ స్థాయిలో నిర్మాణాలు చేపడితే మరింత ఆదాయం వస్తుందో పరిశీలించాలన్నారు. అన్యక్రాంతమైన బ్రాహ్మణ కార్పొరేషన్ స్థలాల స్వాధీనానికి చర్యలు తీసుకోవాలన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్థలంలోని పాఠశాల స్వాధీనానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా స్థలాలను అభివృద్ధి చేసి బ్రాహ్మణ కార్పొరేషన్‌కి కేటాయిస్తామని తెలిపారు. బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. అందులో భాగంగానే ఆలయాలకు నియమించే కమిటీలలో బ్రాహ్మణలకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీ మహేశ్వర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ నాగసాయి, ఏసీ సుభద్ర, బ్రాహ్మణ సంఘం నాయకులు సిరిపురపు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌వోగా శ్రీనివాసులు

● జీఏడీలో రిపోర్టు చేయాలని పెద్ది రోజాకి ఆదేశాలు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా జీ శ్రీనివాసులు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం కడప జిల్లా జీఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టుకు పీఏ టూ స్పెషల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇప్పటివరకు డీఆర్‌వోగా విధులు నిర్వహించిన పెద్ది రోజాకి ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వలేదు. ఆమెని జీఏడీ పొలిటికల్ సెక్రెటరి వద్ద రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. ఏపీసీఆర్‌డీఏ యూనిట్ 8 - 14కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అండ్ కాంపిటెంట్ అథారిటీగా విధులు నిర్వహిస్తున్న ఎం విశ్వేశ్వరనాయుడుని ప్రభుత్వం వైఎస్‌ఆర్ కడప జిల్లాకు డీఆర్‌వోగా పోస్టింగ్ చేసింది.

గంజాయి విక్రేతల అరెస్టు

● నారాకోడూరులో 22.5 కిలోలు స్వాధీనం

6

తుమ్మలపాలెం వైసీపీ ఎంపీటీసీ రద్దు

● తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో పదవిపై అధికారుల చర్యలు

అమరావతి రైలు.. పర్యావరణహితం

- పట్టాలెక్కనున్న చంద్రబాబు కలల ప్రాజెక్టు
- 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు దూసుకెళ్లేలా రైలుమార్గం
- కేంద్రమంత్రి, సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు డీఆర్‌ఎం, అధికారులు హాజరు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రిజర్వు అటవీ ప్రాంతం తగలకుండా.. పర్యావరణ పరిరక్షణ చర్యలతో.. 3.2 కిలోమటర్ల పొడవునా కృష్ణానదిపై ఐకానిక్ వంతెన ఏర్పాటుతో.. దేశంలోని అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీతో.. అమరావతి రైలుమార్గం ఏర్పాటు కానున్నది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో సీఎం చంద్రబాబు కలల ప్రాజెక్టు అమరావతి రైలు త్వరలో పట్టాలెక్కనున్నది. 160 కిలోమీటర్ల వేగంతో రైళ్ల దూసుకెళ్లేలా నూతన రైలుమార్గం నిర్మాణం జరగనున్నది. గురువారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కి డీఆర్‌ఎం ఎం రామకృష్ణతో పాటు ఇతర రైల్వే అధికారులు స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ నుంచి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డీఆర్‌ఎం మీడియాతో మాట్లాడుతూ విజయవాడ - కాజీపేట మార్గంలోని ఎర్రుపాలెం నుంచి ఈ రైలు మార్గం ప్రారంభమై పెద్దపురం, చెన్నారావుపాలెం, గొట్టిముక్కల, పరిటాల మీదగా కృష్ణానది, వడ్డమాను, తాడికొండ, కొప్పురావూరు, నంబూరు వరకు నిర్మాణం జరుగుతుందన్నారు. దీని వల్ల అటు ఉత్తరాది, పశ్చిమ రాష్ట్రాలకు, ఇటు దక్షిణాది రాష్ట్రాలకు ఈ రైలుమార్గం అనుసందానమై ఉంటుందన్నారు. భూసేకరణని ఫాస్టుట్రాక్ పద్ధతిలో చేయనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇందుకోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిపి ఒక టాస్కుఫోర్సుని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రూ.2,245 కోట్ల అంచనా విలువతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని, 57 కిలోమీటర్ల పొడవునా నూతన రైలుమార్గం ఉంటుందన్నారు. దీని వల్ల అమరావతి ప్రాంతం ఆర్థికాభివృద్ధి చెందడంతో పాటు ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ని పరిటాలలో నిర్మించడం వల్ల ఆ ప్రాంతం లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఏడీఆర్‌ఎం సైమన్, సీనియర్ అధికారులు జేవీ అనూష, విజయకీర్తి, ప్రదీప్‌కుమార్, దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమరావతి రైలుమార్గానికి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసిన విషయాన్ని తెలియజేస్తున్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



రైల్వే మంత్రి, సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన గుంటూరు డివిజనల్ రైల్వే అధికారులు



మిర్చియార్డులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ, సీఐలు

మిర్చియార్డులో మళ్లీ విజిలెన్స్ తనిఖీలు

- గేట్ ఎంట్రీ మొదలు ఎగ్జిట్ వరకు పరిశీలన
- స్వయంగా రంగంలోకి ఎస్పీ.. సిబ్బందికి ముచ్చమటలు

8

విభజిత జిల్లాలకు.. నూతన డీఈవోలు

- గుంటూరుకు సీవీ రేణుక, పల్నాడుకు చంద్రకళ
- బాపట్ల డీఈవోగా ఎస్ పురుషోత్తం... డైట్ ప్రిన్సిపాల్ బదిలీ
- గుంటూరు ప్రస్తుత డీఈవో శైలజకు పోస్టింగ్ నిల్
- కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు





ఏఎన్‌యూలో ప్రారంభమైన యువజనోత్సవాలు

- విద్యతో పాటు కళలపై కూడాఆసక్తి పెంచుకోవాలి
- వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు



8

ఊపిరి పీల్చుకోండి

- గుంటూరులో కాలుష్యం కట్టడి
- సాధారణ స్థాయిలోనే శాతాల నమోదు
- మరింతగా తగ్గాలని కోరుకుంటున్న ప్రజలు
- అధిక కాలుష్య నగరాల జాబితా నుంచి బయటకు
- మిగిలిన పట్టణ ప్రాంతాల్లో అందుబాటులో లేని యంత్రాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలతో సరి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నమోదు అవుతున్న వాయి కాలుష్య శాతాలు గుంటూరు నగరవాసులకు ఊరటనిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేపట్టిన కార్యాచరణతో అధిక కాలుష్యం నమోదు అవుతున్న 132 నగరాల జాబితా నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రమైన గుంటూరు ఇప్పుడిప్పుడే బయటకు వస్తుంది. శబ్ధ, పరిశ్రమ, గృహ కాలుష్యాలు పెద్దగా లేనప్పటికీ వాయు కాలుష్యంతో గతంలో గుంటూరువాసులు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో గుంటూరులో వాయు కాలుష్యం 65-68 మైక్రోగ్రామ్స్ క్యూబిక్ క్యూబ్(ఎమ్‌జీక్యూక్యూ) ఉండేది. ఇది సాధారణ స్థాయి అంటే 60 ఎమ్‌జీక్యూక్యూ కంటే చాలా అధికం. ప్రమాదకరస్థాయిలో కాలుష్యం ఉందని కేంద్ర ప్రభుత్వం గుర్తించి చర్యలకు ఉపక్రమించింది. నేషనల్ క్లీనింగ్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ), నేషనల్ యాబింగ్ ఎయిర్ క్వాలిటీ మానిటిరింగ్(న్యాప్) ద్వారా గుంటూరులో ఎప్పటికప్పుడు కాలుష్య శాతాలను నమోదు చేసుకుని వాటి తగ్గింపు చర్యలకు ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో కొంతమేర వాయు కాలుష్యం తగ్గింది. వాయు కాలుష్య నియంత్రణకు అధికారులు చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు వస్తున్నాయి. నగరంలో వాయు కాలుష్య శాతాలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. ఒకప్పుడు రహదారులు సరిగా లేకపోవడం, వాటి నుంచి వచ్చే దుమ్ము, ధూళి, రోడ్డపై ఎక్కడి చెత్త అక్కడే ఉండటం వంటి కారణాలతో నగరంలో ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం ఉండేది. 2021 నుంచి నేటి వరకు నమోదు అవుతున్న వాయు కాలుష్య శాతాలను ఈ మధ్యనే కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసింది. వాటిలో సాధారణ శాతాలు నమోదయ్యాయి.

సమన్వయం లేకపోయినా..

కాలుష్యాన్ని నియంత్రించడానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కార్తికేయ అనే ప్రత్యేక అధికారిని నియమించింది. కానీ ఆశించిన ఫలితాలు రాలేదు. దీనికి శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. సాధారణంగా ప్రతి విభాగానికి ప్రత్యేకశాఖ, యంత్రాంగం ఉంటుంది. కానీ కాలుష్య నివారణకు రవాణాశాఖ, నగరపాలక సంస్థ, పరిశ్రమలశాఖ, కాలుష్య నియంత్రణ, విజిలెన్స్ ఇలా అన్నిశాఖలు కలిసి కార్యాచరణ రూపొందించాలి. ఆయా శాఖల మధ్య సమన్వయం లేకపోవడం.. కొన్ని రకాల నిబంధనలు అడ్డురావడం వంటి కారణాలతో కాలుష్య నియంత్రణ పెద్దగా జరగలేదు. దీనికి తోడు 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కాలుష్య నియంత్రణ అనే ఆలోచన పూర్తిగా అటకెక్కింది. అయినా కొంతమేర కాలుష్యం కట్టడి కావడంపై ప్రజలతో పాటు పర్యావరణవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక విభాగం ఏర్పాటు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించింది. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసినట్లుగా ప్రత్యేక అధికారిని మళ్లీ నియమించాలని యోచిస్తుంది. నేషనల్ క్లీనింగ్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ), నేషనల్ యాబింగ్ ఎయిర్ క్వాలిటీ మానిటిరింగ్(న్యాప్) పథకాలను పటిష్ఠంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఎంపీల సహకారంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపాలిటీలకు స్వచ్ఛత పథకాలు అమలయ్యేలా కార్యాచరణను ప్రభుత్వం రూపొందిస్తున్నది. అవసరమైతే ఇతర దేశాల్లో ఉన్నట్లుగా కాలుష్య నివారణ చర్యలపై దృష్టి సారించింది. పూర్తి అధికారాలను కేటాయిస్తూ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆలోచన చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కార్యాలయాలతో సరి..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఒక్క గుంటూరునగరంలో మినహా మిగిలిన మున్సిపల్ పట్టణాల్లో కాలుష్యాన్ని లెక్కించే యంత్రాలు లేవు. ప్రస్తుతానికి జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్ల పట్టణాల్లో కాలుష్య నియంత్రణ కార్యాలయాల్ని ఏర్పాటు చేశారు. అంతే తప్ప మిగిలిన కార్యకలాపాలను రూపొందించలేదు. కేవలం కాలుష్య నియంత్రణకు సదస్సులను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రాల్లో అయినా కాలుష్య నమోదు యంత్రాలను ఏర్పాటు చేసి కాలుష్యం శాతాన్ని లెక్కించి కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గాలి ఇలా శుభ్రం..

- 2021-22లో కరోనా కారణంగా వాహనాలు రోడ్లపైకి రాకపోవడంతో కాలుష్యం పూర్తిగా నియంత్రణలో ఉంది.
- గుంటూరు నగరంలో 2023 నుంచి విద్యుత్ వాహనాలు కొనుగోళ్లు పెరిగాయి. నగరంలో ఉన్న వాహనాల్లో దాదాపు 3 శాతం విద్యుత్ వాహనాలే. ఈ కారణంగా కూడా కొంత మేర వాయు కాలుష్యం తగ్గిందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.
- భారీ జరిమానాలకు భయపడి కాలం చెల్లిన వాహనాలను నగరంలో తిప్పడానికి యజమానులు భయపడుతున్నారు. దీంతో వాయి కాలుష్యం నెమ్మదించిందని రవాణాశాఖాధికారులు చెబుతున్నారు.
- మొక్కలు నాటే కార్యక్రమాలు గత కొన్నేళ్లు పెరిగాయి. విద్యార్థులు, స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వం ఉద్యమ తరహాలో మొక్కలు నాటుతున్నాయి. వీటితో పాటు కాలుష్య రహితం కోసం అవగాహన సదస్సులతో కాలుష్యం శాంతించింది.

58 శాతానికి తగ్గాలి



గుంటూరులో వాయి కాలుష్యం 58శాతానికి తగ్గాలి. దీనికి అనుగుణంగా నగరపాలక సంస్థ, రవాణా, మైనింగ్ శాఖలతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వాయు కాలుష్యానికి వాహనాలతో పాటు రోడ్లపై వచ్చే దుమ్ము, నూతనంగా భవనాల నిర్మాణ సమయంలో వస్తున్న దుమ్ము మరో కారణంగా భావిస్తున్నాం. భవన నిర్మాణ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం. విజయవాడలో తరహాలో వాయు కాలుష్యాన్ని లెక్కించే యంత్రాన్ని గుంటూరులో ఏర్పాటుకు నగరపాలక సంస్థ అధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే యంత్రాన్ని ఏర్పాటు చేస్తాం. గతంలో శాంపిల్స్‌ను తీసుకుని పరీక్షించి అటుపై శాతాలను నమోదు చేసేవాళ్లం. నూతన యంత్రంతో అప్పటికప్పుడే కాలుష్యాన్ని లెక్కించి, శాతాన్ని వెంటనే తెరపై ప్రదర్శించే ఏర్పాటు చేస్తాం.

- ఎమ్డీ నజీనాబేగం, పర్యావరణ ఇంజనీరు, గుంటూరు



సీఎం చంద్రబాబునాయుడు నుంచి చెక్కు అందుకుంటున్న ప్రసాద్ పాండా

విజ్ఞాన్ ఇండస్ట్రియల్ డైరెక్టర్‌కు

డ్రోన్ హ్యాకథాన్ అవార్డు

గుంటూరు(విద్య),అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇండస్ట్రియల్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న ప్రసాద్ పాండాకు డ్రోన్ హ్యాకథాన్‌లో అవార్డు లభించినట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'అమరావతి డ్రోన్ సమ్మిట్ 24'లో తమ వర్సిటీకు చెందిన ఇండస్ట్రియల్ డైరక్టర్ ప్రసాద్ పాండాకు డ్రోన్ హ్యాకథాన్‌లో మూడవ బహుమతి అందుకున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డుతో పాటు రూ.50 వేల నగదు బహుమతిని పొందారని తెలిపారు.

తుమ్మలపాలెం వైసీపీ ఎంపీటీసీ రద్దు

ప్రత్తిపాడు, అక్టోబరు 24: తుమ్మలపాలెం వైసీపీ ఎంపీటీసీ మేరుగు సుభాషిణి సభ్యత్వం రద్దు అయింది. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో చేపట్టిన ఎంపీటీసీ పదవిని రద్దు చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులను సుభాషిణికి ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి అందజేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో తుమ్మలపాలెం బీసీ మహిళలకు రిజర్వు అయింది. ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఆమె, బీసీ మహిళగా ఎన్నికల్లో పోటీచేసి ఎంపీటీసీగా ఏకగ్రీవంగా గెలిచింది. ఈ ఎన్నికలకు ముందు సుభాషినికి ఎస్సీ కుల ధృవీకరణ పత్రాన్ని అప్పటి తహసీల్దార్ పూర్ణచంద్రరావు ఇచ్చారు. అయితే, ఈ ధృవీకరణపత్రాన్ని పక్కన పెట్టిన సుభాషిణి, అప్పటి సమగ్రశిక్షా అడిషనల్ కో ఆర్డినేటర్ పి.రమేష్ ఆమెకు బీసీ-సీ అంటూ ఇచ్చిన డిక్లరేషన్‌తో ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. దీనిపై యనమదలకి చెందిన సామాజిక కార్యకర్త జింకా బాజిబాబు సమాచార హక్కు చట్టం కింద ఎన్నికల సంఘం నుండి పూర్తి వివరాలను సేకరించి, లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అప్పటి కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశాలమేరకు ఒక స్క్రూటినీ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయడంతో సుభాషిణి 'ఎస్సీ' అని తేలింది. అయితే, అప్పటి జిల్లా అధికారులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అని తేల్చారు తప్ప ఎంపీటీసీ సభ్యత్వాన్నిరద్దు చేయలేదు. దీంతో, బాజిబాబు అంతటితో ఆగకుండా ఆమె సభ్యత్వాన్ని రద్దు చేయాలని అందుకు కారకులైనవారిని శిక్షించాలంటూ తిరిగి లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారులు ఆమె ఎంపీటీసీ సభ్యత్వాన్ని హోల్డ్‌లో పెడుతూ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచమండల పరిషత్‌కు అందిన ఉత్తర్వులను ఎంపీటీసీకి పంపి సంతకం తీసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ముప్పాళ్ళ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తెల్లవారు జామున మండలంలోని మాదలలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలమేరకు మండలంలోని మాదలకు చెందిన ఉగ్గం శ్రీను(43) గత పదేళ్లగా ఏడు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఏడు ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి సాగు పెట్టుబడి నిమిత్తం రూ.15 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక పశువుల పాక వద్దకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య గంగమ్మ మృతిచెందిన భర్త శ్రీనుని చూసి తమ బంధువులకు తెలియజేసింది. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని వారు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

డిజిటల్ సాంకేతికతతో మిర్చిలో తామర పురుగుల నివారణ

గుంటూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లగా ఆగ్నేషియా తామర పురుగులు మిర్చి పంటను దెబ్బతీస్తూ రైతులను కష్టనష్టాల పాలు చేస్తున్నాయని గుంటూరు జిల్లా వ్యవ సాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. క్యాబి అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ,ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా గుంటూరులో గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాలలో రెండు వేల మంది మిర్చి రైతులకు అవగాహన కల్పించే నిమిత్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికతతో మిర్చిలో తామర పురుగుల నివారణ సాధ్యమవుతుందని అన్నారు. ఉద్యాన పంటల పరిశోధనా కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ నల్ల తామర పురుగులు వ్యాప్తిపై రైతులు అవగాహన పెంపొందించు కోవాలని, సమగ్ర సస్యరక్షణ చర్యలతో మిర్చి పంటచేపట్టాలని సూచించారు. అనంతరం, లాం ఫామ్ శాస్త్రవేత్త సాంబశివరావు, విజ్ఞాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రమేష్ బాబు, క్యాబి అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు మధు మంజరి, డాక్టర్ మహేష్ మాట్లాడారు. తమ సంస్థ మిర్చి పంటలో నల్ల తామర పురుగు సమర్ధ నిర్వహణ కోసం నాలుగు రకాల డిజిటల్ టూల్స్ అభివృద్ధి చేశామని, తద్వారా వాటిని అరికట్టవచ్చని 'క్యాబి' ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 60 మంది కార్యకర్తలకు శిక్షణ దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్లాంట్ నాలెడ్జ్ బ్యాంకు, ప్యాట్ సీడ్స్ ,బయో ప్రొటెక్షన్ యాప్, క్రాఫ్ట్ స్కేవర్ యాప్ వివరాలను శిక్షకులకు వివ రించారు. కార్యక్రమంలో ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏరువాక రాఘవరావు, ఎఫర్ట్, ఐటీసీ సంస్థల కార్యకర్తలు ఇన్పుట్ కంపెనీ ప్రతినిధులు, మిర్చి ఎగుమతి దారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 22.5 కిలోల గంజాయి స్వాధీనం

చేబ్రోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రేతలను అరెస్టు చేసి వారి నుంచి 22. 5 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్లు పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు తెలిపారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో గురువారం మీడియా సమక్షం లో నిందితులను ప్రవేశపెట్టారు. సీఐ మాట్లాడుతూ మండల పరిధిలోని నారా కోడూరులోని గజవల్లి స్పిన్నింగ్ మిల్లు సమీపంలోని ఖాళీ స్థలాల వద్ద గంజాయి ఉందనే సమాచారంతో ఎస్ఐ వి.వెంకట కృష్ణ, సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సోదాలలో కొందరు వ్యక్తులు సంచులతో నిలబడి ఉండడాన్ని గమనించి అక్కడికి వెళ్లగా పారిపోయేందుకు యత్నించారన్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, స్పిన్నింగ్ మిల్లు పరిసర ప్రాంతాలలో కూలి పనులు చేసుకుంటున్న వారు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణ చేస్తు న్నారని,చేబ్రోలు, తెనాలి ప్రాంతాలలో గంజాయి అక్రమంగా విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. కళాశాల విద్యార్థులు, కార్మికులు, నిరుద్యోగ యువత లక్ష్యంగా వారుగంజాయి విక్రయాలు సాగిస్తున్నారని తెలిపారు. 10 రోజుల క్రితం వారు ఒరిస్సా వెళ్లి రూ.50 వేలకు 27.5 కిలోల గంజాయి కొనుగోలు చేసి రైలు, రోడ్డు మార్గాలలో నారాకోడూరు తీసుకువచ్చినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి కాకుండా మరో 5 కిలోల గంజాయని ఇద్దరు వ్యక్తులు విక్రయించడానికి వెళ్లినట్లు గుర్తించామన్నారు. కోటిపల్లి రాజా, నీలాధామస్ పాల్, సంతోష్ గౌడ్, షేక్ ఫజల్; అరెస్టు చేయగా, మరో ఇద్దరు వెలగా విజయసాయి, ప్రశాంత్ మాలిక్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు.

బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ కోర్సుకు

వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ

గుంటూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్, కోర్సులో అగ్రిసెట్ ద్వారా ప్రవేశాలకు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఈ నెల 28 నుంచి 30 వరకు జరగనుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని యూనివర్శిటీ రిజిస్ట్రార్ రామచంద్రరావు గురువారం ఓ ప్రకటనలో సూచించారు. వివరాలకు వెబ్‌సైట్ 'ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్' ను చూడాలని కోరారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజె క్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువనుంచి 1,15,415 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుంది. పాజెక్టు వద్ద 1,85,855 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల కాకా, వీటిలో 16వేల క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా, మిగిలినవి ఏడు గేట్ల ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

37,901 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 35,333 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,901 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 24,061 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	8200	15500
నెంబరు. 5	9000	14500	నెంబరు. 5	10600	13000
273	12000	14000	273	12000	14500
341	9000	15500	341	9000	15500
4884	11500	13500	4884	14000	16000
సూపర్ 10	10500	12000	సూపర్ 10	10000	15500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8500	18500	తేజ	9000	18600
బ్యాడిగి	9000	15500	బ్యాడిగి	9500	14500
దేవనూరు డీలక్స్	9500	15600	దేవనూరు డీలక్స్	12000	14500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

చీటీ పాటల పేరుతో పరారైనవారిలో

ఒకరి అరెస్టు, కోర్టులో ముగ్గురు లొంగుబాటు

గుంటూరు, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి) : చీటీ పాటల పేరుతో కోట్ల రూపాయలు కాజేసి పరారైన కేసులో గురువారం అరండల్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్ పరిధిలోని చైతన్యపురి కాలనీకి చెందిన మారెడ్డి చంద్రావతి, సుబ్బారెడ్డి దంపతులు ఎన్నో సంవత్సరా లుగా అనధికారిక చీటీపాటలు నిర్వహిస్తున్నారు. దీంతో స్థానికులు పెద్ద సంఖ్యలో సభ్యులుగా చేరారు. అయితే కొద్ది రోజుల క్రితం నిందితులు తాము ఉంటున్న ఇంటితో సహా ఆస్తులను విక్రయించేసి రాత్రికి రాత్రి అదృశమయ్యారు. దీంతో పెద్ద సంఖ్యలో బాధితులు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితురాలు నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు చంద్రావతి, సుబ్బారెడ్డి దంపతులతో పాటు వారి కుమారులైన శ్రీహర్ష రెడ్డి అలియాస్ శ్రీహర్ష, శ్రీకాంత్ రెడ్డి లపై చీటింగ్ కేసు నమోదుచేశారు. అప్పటి నుంచి నిందితులు పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఇది ఇలా ఉంటే మారెడ్డి చంద్రావతి, సుబ్బారెడ్డి దంపతులు తమ ఇంటితోపాటు ఆస్తులను విక్రయించిన సమయంలో వచ్చిన డబ్బులను వారి కుమారుల ఖాతాల్లోకి మళ్ళించినట్లు పోలీసులు గుర్తించారు. సుబ్బారెడ్డి కుమారుడు శ్రీ హర్ష రెడ్డి అలియాస్ శ్రీ హర్షను గురువారం అరండల్ పేట పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఇదే కేసులో నిందితులైన వారి తల్లిదండ్రులు చంద్రావతి, సుబ్బారెడ్డి లతో పాటు మరో కుమారుడు శ్రీకాంత్ రెడ్డిలు కూడా గురువారం కోర్టులో లొంగిపోయారు. వారి ముగ్గురిని కూడా కోర్టు రిమాండ్ చేస్తూ ఆదేశించింది. చీటీ పాటల పేరుతో కోట్ల రూపాయలను దారి మళ్ళించి మోసం చేసిన మారెడ్డి చంద్రావతి, సుబ్బారెడ్డి దంపతులతో పాటు వారి కుమారులైన శ్రీ హర్షారెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలను కస్టడీకి తీసుకొని విచారించాల్సి ఉందని అరండల్‌పేట పోలీసులు తెలిపారు. త్వరలోనే వారిని కస్టడీకి అనుమతి కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

గుంటూరు మీదుగా

ప్రత్యేక రైళ్లు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదుగా సనత్‌నగర్, సంత్రగచిలకు రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07069 సనత్‌నగర్ - సంత్రగచి ప్రత్యేక రైలు ఈనెల 30, నవంబరు 6 ఉదయం 6.20 గంటలకు బయలుదేరి, 11.11 గంటలకు పిడుగురాళ్ల, 12.01 గంటలకు సత్తెనపల్లి, 12.55 గంటలకు గుంటూరు, మరుసటి రోజు మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచి చేరుకుంటుంది. రైలు నంబరు 07070 సంత్రగచి - సనత్‌నగర్ ప్రత్యేక రైలు ఈ నెల 31, నవంబరు 7 తేదీల్లో సాయంత్రం 5.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4.20 గంటలకు గుంటూరు రాత్రి 11.50 గంటలకు సనత్‌నగర్ చేరుకుంటుంది.

లిటిల్‌స్టెప్స్ ఆధ్వర్యంలో పోలియో నిర్మూలనపై ర్యాలీ

గుంటూరు(విద్య),అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):స్థానిక రింగురోడ్డులోని లిటిల్‌స్టెప్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్‌లో గురువారం ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకునిర్యాలీ నిర్వహించినట్లు డైరెక్టర్ షాజహాన్,ప్రిన్సిపల్ సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. జేకేసి కళాశాల నుంచి నవభారత్‌నగర్ మెయిన్ రోడ్డు వరకు నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే గళ్లామాధవి ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ సెంటెనియల్ గుంటూరు అధ్యక్షులు బాలసుబ్రమణ్యం నవీన్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సమాజ సభ్యులు

సీఎం సహాయ నిధికి విరాళం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధికి రూ 1,90,000 చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గురువారం విశ్వబ్రాహ్మణ సమాజ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా సమాజ సభ్యులను చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించిటనట్లు గుంటూరు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కడియాల సుబ్బారావు తెలిపారు. దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం, పలువురు విశ్వబ్రాహ్మణ ప్రముఖులు సహకారంతో ఈ విరాళాన్ని సేకరించినట్లు తెలిపారు.

అబద్ధాలు ఆడేందుకే జగన్ నోరు

● కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి కేవలం అన్నం తినటానికి, అబద్ధాలు ఆడటానికి మాత్రమే నోరు తెరుస్తాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు ముఖ్య అనుచరుడైన వైసీపీకి చెందిన వల్లభాపురం మాజీ సర్పంచ్ వంగా సుధాకరరెడ్డి వల్లనే తన కుమారుడు రౌడీషటర్‌గా మారి ఇలాంటి నేర ప్రవృత్తికి అలవాటు పడ్డాడని నిందితుడు నవీన్ తల్లి కుమారి వాపోతుంటే, నిందితుడు టీడీపీ సానుభూతిపరుడని వైసీపీ అధినేత జగన్ ప్రచారం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

తల్లీచెల్లిపై కోర్టుల కెక్కిన చరిత్ర హీనుడు జగన్

● మాజీ మంత్రి డొక్కా

గుంటూరు(తూర్పు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎటువంటి నైతిక విలువలు లేకుండా సొంత తల్లి, చెల్లిపై కోర్టు కెక్కి వారిని ఇబ్బందులు పెట్టడం చూస్తే జగన్‌మోహనరెడ్డి చరిత్ర హీనుడుగా నిలవబోతున్నాడని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు విమర్శించారు. స్థానిక అరండల్‌పేటలోని కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రి కాకముందు ఆస్తుల విలువ ఎంత....ఇప్పుడు ఎంత అని ప్రశ్నించారు. వచ్చే పార్లమెంటు సమావేశాలలో జగన్ ఆస్తులపై, ఆయన సంస్థల్లోకి వచ్చిన ఆశ్రీత పెట్టుబడులపై చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. జగన్ ఆస్తులను న్యాయ విచారణ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి చేరేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జనసేన నాయకులు పాలకాయల వెంకట్ పాల్గొన్నారు.

జగన్ విమర్శలు సరికాదు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి వంటి పలు బృహత్ అభివృద్ధి పనులు చేపడుతున్న కూటమి ప్రభుత్వంపై వైసీసీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి కనీస అవగాహన లేకుండా విమర్శించడం సరికాదని జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక లాడ్జి సెంటర్ కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆస్తి పంపకం విషయంలో తన సొంత తల్లిపై, చెల్లిపై కోర్టు కెక్కి వారిని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న జగన్,రాష్ట్రంలో అక్కా చెల్లెమ్మలకు అన్యాయం జరుగుతోందని గుండెలు బాదుకోవడం హాస్యాస్పదమన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి వైసీపీ నేతల అభినందనలు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు, చిత్తూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి జిల్లాకు చెందిన వైసీపీ నేతలు గురువారం తాడేపల్లిలోని నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. నవంబరు రెండో తేదీన వైసీపీ నగర అధ్యక్షుడు డైమండ్‌బాబు ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని కోరారు.


యువజనోత్సవాలలో విద్యార్థుల ప్రదర్శన

ఆటపాటలకు వేదికగా విశ్వవిద్యాలయం

పెదకాకాని, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): ఆటపాటలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదిక అయింది. మ్యూజిక్, థియేటర్ ఆర్ట్స్ పోటీలలో విద్యార్థులు పోటీపడి మరీ వారి ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్యంగా క్లాసికల్ డాన్స్ లో అలనాటి మేటి చిత్రాల్లో ప్రముఖ నర్తకి మనులు నృత్యం చేసిన పాటలకు నేటి యువత అడుగులు వేయడం చూపర్లను ఆకట్టుకుంది. తొలిరోజు గురువారం యువజన ఉత్సవాలలో భాగంగా క్లాసికల్ ఇంస్ట్రుమెంటల్ సోలో, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్టన్ లోకల్ సోలో, వెస్టన్ గ్రూప్ సాంగ్ లలో విద్యార్థులు మంచి ప్రదర్శనలు ఇచ్చారు. ఇక మిమిక్రీ అయితే నేరుగా సినిమాలు, సీరియల్ లో నటన చూస్తున్నట్లుగానే ప్రదర్శన సాగింది. వారిలో దాగివున్న నైపుణ్య కళాత్మకత నేడు ఆవిష్కృతమయ్యాయని చెప్పవచ్చు.

విస్తరణ ఆక్రమణల కోసమా..!

● చుట్టుగుంట వద్ద అధిక సంఖ్యలో మటన్, చికెన్, ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు

● కొందరైతే ఆక్రమించుకొని అద్దెకు ఇస్తున్నవైనం

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చుట్టుగుంట వద్ద.. నల్లపాడు వైపు నుంచి నగరంలోకి వచ్చే మార్గం ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నందున నగరపాలకసంస్థ చేపట్టిన రహదారి విస్తరణ నిరుపయోగంగా మారింది. ఇక్కడ తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ద్విచక్ర వాహనదారులు తీవ్రగాయాలు పాలవుతున్నారు. ఇప్పటికే కొందరు ప్రాణాలు కూడా కోల్పోవడంతో చుట్టుగుంట చెరువు వాకింగ్ ట్రాక్‌ని లోపలికి జరిపి రోడ్డు కోసం స్థలాన్ని విస్తరించారు. గతంలో ఉన్న బస్ షెల్టర్, విద్యుత్ స్తంభాలను తొలగించారు. ఈ రహదారి రోడ్లు, భవనాల శాఖకు చెందింది. ఆ డిపార్టుమెంట్ నిధుల కొరత సాకుతో విస్తరించిన ప్రదేశంలో రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు. మరోవైపు నగరపాలకసంస్థ కూడా తన బడ్జెట్ నుంచి నిధులు వెచ్చించడానికి సుముఖంగా లేదు. ఈ పరిస్థితి ఆక్రమణదారులకు ఒక వరంగా మారింది. విస్తరించిన ప్రదేశం మొత్తాన్ని ఆక్రమించేస్తున్నారు. కొందరైతే మటన్, చికెన్ స్టాల్స్, ఇంకొందరు పుల్కా పాయింట్‌లు, ఫాస్టుఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్థలం ఏదో వారి సొంతమైనట్లుగా ముందుగానే తాటాకులతో పందిరి ఏర్పాటు చేసి పాగా వేస్తున్నారు. ఆ తర్వాత వేరే వారికి అద్దెకు ఇస్తూ నెలవారీ వసూళ్లు చేసుకుంటున్న వారూ లేకపోలేదు. ఈ క్రమంలో గొడవలు కూడా అక్కడ జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. నిత్యం అటుగా సంచరించే నగరపాలక సంస్థ ఆక్రమణల నిర్మూలన దళం కళ్లెదుటే ఆక్రమణలు వెలుస్తున్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇందుకు కారణం అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లేనని ఆరోపణలు వస్తున్నాయి. తక్షణమే నగరపాలకసంస్థ, రోడ్లు, భవనాల శాఖ సమన్వయం చేసుకొని ఆక్రమణలు తొలగించి రహదారిని విస్తరించి విశాలంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.


చుట్టుగుంట వద్ద స్టేట్ హైవేపై విస్తరించిన ప్రదేశంలో ఏర్పాటైన ఆక్రమణలు




వాహనాల షెడ్డులో తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

మ్యాపింగ్ చేసి చెత్త తరలింపు వాహనాలు కేటాయించాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి శానిటరీ డివిజన్ ఇన్స్పెక్టర్, ట్రాక్టర్, డ్రైవర్లకు మ్యాపింగ్ చేసి చెత్త తరలింపు వాహనాలు కేటాయించాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక కేవీపీ కాలనీలోని నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్డుని గురువారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వెహికిల్ షెడ్‌లో నిర్దేశిత సమయానికి పూర్తి స్థాయిలో డ్రైవర్లు, పర్యవేక్షణ చేసే ఏఈ విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఎన్ని పర్యాయాలు చెప్పినా పనితీరులో మార్పు కనబడడం లేదని అన్నారు. ఇక నుండి ఉదయం 5 గంటలకు హాజరుకాకుంటే కఠిన చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు. వెహికిల్ షెడ్‌లో డ్రైవర్ల హాజరుకి రిజిస్టర్ మెయిన్టైన్ చేయాలన్నారు. వాహనాల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరగాలని, మరమ్మతులను ఏ విధమైన కాంట్రాక్టర్ లేకుండా నేరుగా మెకానిక్ షాప్‌తో డిపార్ట్మెంట్ తరపున చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-ఆటోల నిర్వహణకు సదరు కాం ట్రాక్ట్ ఏజన్సీ 2 రోజుల్లో తగిన ఏర్పాట్లు చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసు కోవాలని ఏఈని ఆదేశించారు. అనంతరం అదనపు కమిషనర్, సిఎంఓహెచ్, ఎంహెచ్ఓ, ఇతర ప్రజారోగ్య అధికారులతో సమావేశమయ్యారు. శానిటరీ డివిజన్ వారీగా ట్రాక్టర్, డ్రైవర్లను గురువారం సాయంత్రానికి మ్యాపింగ్ చేయాలన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అమృత్ పథకం కింద ఉచిత కుళాయి కనెక్షన్లు

అమృత్ పథకంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో దారిద్ర్య రేఖకు దిగువన(బిపిఎల్) ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచితంగా కుళాయి కనెక్షన్ అందిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అరు లైన వారు స్థానిక వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని, దారిద్ర్య రేఖకు దిగువున ఉండి, తెల్ల రేషన్ కార్డుకల్గి, ఏడాదికి రూ.5 వందలలోపు ఆస్తి పన్ను కల్గిన వారి నివాసాలకు ఉచిత కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశమును వినియోగించుకొని ఉచిత నీటి కుళాయి కనెక్షన్ పొందవచ్చని తెలిపారు.

మహా ప్రస్థానం అభివృద్ధికి కృషి అభినందనీయం

గుంటూరు(విద్య),అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మహా ప్రస్థానం అభివృద్ధికి సభ్యులు కృషి చేయడం అభినందనీయమని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాస్ అన్నారు. స్థానిక బొంగరాలబీడు మహా ప్రస్థానం కమిటీ సభ్యులు నగర కమిషనర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో మహా ప్రస్థానం కమిటీ కార్యదర్శి ఆళ్లగడ్డ అంకమ్మ చౌదరి, సభ్యులు కల్లూరి రమణయ్య, జంగాలపల్లి పార్థసారథి, కె.మాలకొండయ్య, పి.మోహన్ రావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో జిల్లాకు విజయం అభినందనీయం

● జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా హిందూపురంలో జరిగిన జిల్లా పరిషత్ యూ/17 కేటగిరి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో గుంటూరు జిల్లా బాలికల టీమ్ ప్రథమ స్థానంలో, బాలుర టీమ్ ద్వితీయ స్థానంలో విజయం సాధించడం అభినందనీయమని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. గెలుపొందిన జడ్పీ విద్యార్థులు గురువారం ఛైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో హెనీ క్రిస్టినాను కలిశారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ జడ్పీ విద్యార్థులు దేశ స్థాయి పోటీలకు వెళ్లాలని ఆకాంక్షించారు.

నల్లపాడులో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లపాడు టిడ్కో ఇళ్లలో కుటుంబ కలహాల నేపథ్యంలో గోగుల శ్రీనాథ్ (32) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనాద్ గతంలో లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ప్రమాదాల కారణంగా గాయాలు కావడంతో కొంత కాలంగా శ్రీనాద్ ఖాళీగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. ఇదిలా ఉంటే బుధవారం శ్రీనాథ్ భార్య ఇద్దరు పిల్లలతో శుభకార్యానికి వెళ్ళింది. రాత్రికి అక్కడే ఉన్నారు. రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీనాథ్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఇంటికి వచ్చిన భార్యాపిల్లలు, శ్రీనాద్ ఉరివేసుకుని ఉండటం గమనించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ కలహాలు నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు అంటున్నారు. మృతుడి భార్య బ్యూటీ పార్లర్ నిర్వహిస్తుంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుర్తుతెలియని వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇటీవల బుడంపాడు గ్రామం వద్ద అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధుడిని స్థానికుల సమాచారంతో 108 ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన గురువారం మృతి చెందాడు. ఆయన వయస్సు 70 ఏళ్లకు పైబడి ఉండొచ్చని సమాచారం. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుని సమాచారం తెలిసిన వారు నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐను 86888 31376 నంబరులో సంప్రదించాలని పోలీసులు కోరారు.

రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలి: వెస్ట్ డీఎస్పీ

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్ల వారి పద్ధతి మార్చుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం రాత్రి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణబాబు కాలనీలో వారధి కార్యక్రమం నిర్వహించారు.

బదిలీపై వెళుతున్న ఇద్దరు ఆర్ఐలకు సన్మానం

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో రిజర్వ్ ఇన్స్పెక్టర్లుగా పనిచేసి బదిలీపై వెళుతున్న ఇరువురు ఆర్ఐలు శ్రీనివాసరావు, బ్రహ్మానందంలను సత్కరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జిల్లా ఎఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ శాంత కుమార్ స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన సంస్థను వదిలే ప్రసక్తే లేదు

● సాఫ్ట్‌వేర్ కంపెనీ బాధితులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): యువతను మోసం చేసినవారిని ఎవరినీ, ఏ సంస్థను వదిలిపెట్టే ప్రసక్తే లేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి హెచ్చరించారు. నియోజకవర్గంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్థానిక అరండల్‌పేటలో ఇటీవల బోర్డు తిప్పేసిన సాఫ్ట్ వేర్ సంస్థ బాధితులైన యువకులు అనేక మంది ఆమెను కలిసి తమ గోడు విన్నవించారు.. ఆ సాఫ్ట్‌వేర్ సంస్థ తమ వద్ద నుంచి లక్షలో డబ్బు వసూలు చేసి మోసం చేసిందని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కంపెనీ నిర్వాహకులు ఒక్కొక్కరి వద్ద లక్షన్నర నుంచి ఆరు లక్షల వరకు తమ వసూలు చేసి బోర్డు తిప్పేశారన్నారు. వారి సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసు ఉన్న తాధికారులతో ఇప్పటికే మాట్లాడానని, నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని పోలీ సులకు సూచించినట్లు తెలిపారు. ఈ విషయానిన ఎస్పీ దృష్టికి తీసుకెళ్ళి బాధితులం దరికీ న్యాయం చేస్తానని వారికి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదవ్వాలి

● ఎమ్మెల్యే నసీర్


ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పట్టభద్రులందరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్లు, స్టాఫ్ నర్స్‌లు, సిబ్బంది తదితర వెయ్యి మంది పట్టభద్రులకు ఆయన ఓటరు నమోదు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకొని ఎన్డీఏ కూటమి అభ్యర్థి అయినటువంటి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, ఎల్లావుల అశోక్ పోతురాజు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● సీఎం సహాయ నిధి ప్రాణాలు కాపాడింది

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులకు డబ్బులు లేక తమ కవల చిన్నారులను కాపాడుకోవడానికి అప్పులపాలైన సంగడి గుంట ఇందిరా కాలనీవాసులు సయ్యద్ జాహిద్ హుసేన్, జీనాభి దంపతులకు ఎమ్మెల్యే నసీర్ గురువారం సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. కవలలు ఒకరికి లక్ష, ఇంకొకరికి రూ. 85వేలు సీఎం సహాయ నిధి వచ్చేలా ఆయన చొరవ తీసుకున్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా మీడియా

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, పత్రిక సమాచార కార్యాలయం(పీఐబీ) విజయవాడ ఆధ్వర్యంలో గ్రామీణ, జిల్లా పాత్రికేయులకు వార్తా లాప్ మీడియా వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలు సామాన్యుడి కోసం పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ప్రజల్లో సానుకూల దృక్పథం కల్గించే వార్తలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. న్యాయకళాశాల ప్రిన్సిపల్ వెలగపూడి దుర్గాంబ, దివాకర్ బాబు, సీనియర్ పాత్రికేయుడు ఎం.సాంబశివరావు మాట్లాడారు. సహాయ సంపాదకుడు కె వెంకటరమణ, అసిస్టెంట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ గుంటూరు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అమరావతి కి రైల్వే లైన్ రావటం శుభపరిణామం


గుంటూరు సిటీ, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల కలల రాజధాని అమరావతి కి రైల్వే లైన్ రావటం శుభపరిణామం అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగవిఠల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ , రైల్వే శాఖ మంత్రి వైష్ణవ్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌లకు బీజేపీ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యోగులు ప్రైవేటు క్రిమినల్ కేసుల వల్ల సస్పెన్షన్ అయితే..

● పెన్షన్ దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వ్యక్తిగత సివిల్, క్రిమినల్ కేసుల వల్ల సస్పెండైన వారిని క్రమబద్ధీకరించే విధానం గురించి రాష్ట్ర పెన్షన్ దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యా లయానికి బయట ప్రభుత్వ ఉద్యోగి ప్రైవేటు క్రిమినల్, సివిల్ కేసులలో ఉండి సస్పెండై అటు తర్వాత విధి నిర్వహణకు పునర్నియామకం పొందిన ఉద్యోగి సస్పెన్షన్ కాలాన్ని ఈ క్రింది తెలిపిన విధంగా క్రమబద్ధీకరించాలని తెలిపారు. సస్పెన్షన్ అయిన తేదీ నుంచి తిరిగి కార్యాలయంలో చేరిన తేదీ వరకు ఉన్న కాలాన్ని నాన్ డ్యూటీగా పరి గణిస్తారన్నారు. కార్యాలయానికి సంబంధం లేని, వ్యక్తిగత కారణాల వల్ల సస్పెం డయ్యాడు కనుక ఈ విషయంలో ప్రభుత్వానికి ఏమాత్రం సంబంధం లేదని,అందువల్ల సస్పెన్షన్ కాలాన్ని 'నో వర్క్, నో పే' అనే సూత్రాన్ని అనుసరించి అతనికి ఎలాంటి జీత భత్యాలు చెల్లించనవసరం లేదని పేర్కొన్నారు. ఒక వేళ అతను కోర్టు కేసుల్లో నిరపరాధి అని తేలినప్పటికీ అతనికి, జీతభత్యాలు రావు, కానీ అతనికి ఏమైనా జీవనభృతి చెల్లించి ఉంటే ఆ మొత్తాన్ని రికవరీ చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇక సస్పెన్షన్ కాలాన్ని నాన్ డ్యూటీగా పరిగణించాలని, అతని జీతభత్యంలు జీవన భృతికి కుదిం చాలని, కానీ ఒక వేళ ఉద్యోగి సస్పెన్షన్ కాలాన్ని అర్హత గల సెలవుల కింద మార్చ మని కోరితే ఆ సెలవులు మంజూరు చేయవచ్చని పేర్కొన్నారు. సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగి శాఖాపరమైన లేక కోర్టు కేసుల విషయమై క్రమశిక్షణా చర్యలు పూర్తికాకముందే చనిపోతే కనుక సస్పెండ్ అయిన తేదీ నుంచి చనిపోయిన తేదీ వరకు గల కాలాన్ని డ్యూటీగా అన్ని విషయాలకు పరిగణించాలని, అతని కుటుంబ సభ్యులకు అతను సస్పెండ్ కాకుండా ఉంటే వచ్చే జీతభత్యాలను చెల్లించాలని వీరయ్య తెలిపారు.

స్క్రీనింగ్ పరీక్షలతో కేన్సర్ వ్యాధుల నిర్ధారణ


మాట్లాడుతున్న డాక్టర్ షమా సుల్తాన

గుంటూరు మెడికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలతో రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ వ్యాధులను తొలి దశలోనే గుర్తించి పూర్తిగా నయం చేయవచ్చని గైన కాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తాన తెలిపారు. కేన్సర్ అవగాహన మాసో త్సవంగా సందర్భంగా హోప్ విన్ హాస్పిటల్, ఒమేగా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో గురు వారం బారా ఇమామ్ పంజా సెంటర్‌లోని హోప్ విన్ హాస్పిటల్ ఓపీ విభాగంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. ఈ శిబి రానికి హాజరైన 100 మంది మహిళలకు బీపీ, బ్లడ్ షుగర్ పరీక్షలు నిర్వహించారు. వీటితోపాటు రొమ్ము కేన్సర్ నిర్ధారణకు మామోగ్రాఫీ, గర్భాశయ ముఖద్వార కేన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించారు. బీపీ, షుగర్ రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షమా సుల్తాన మాట్లాడుతూ మామోగ్రఫీ, పాప్‌స్మియర్ స్క్రీనింగ్ పరీక్షలతో రొమ్ము, గర్భాశయ కేన్సర్‌లను ముందుగానే తెలుసుకోవచ్చన్నారు. దీని వల్ల సకాలంలో తగిన చికిత్సలు పొంది వ్యాధి నుంచి బయటపడవచ్చన్నారు. గర్భాశయ కేన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినట్లు ఆమె వెల్లడించారు.

అమరావతి రైల్వేపై కేంద్రం సహాయం హర్షణీయం

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని అత్యున్నత ప్రమాణాలు గల రాజధానిగా తీర్చిదిద్దడంలో కేంద్రం సహాయం హర్షణీయమని గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజధాని అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం మరో ముందుడుగు వేసిందని, రూ. 2,245 కోట్ల పెట్టుబడితో అమరావతికి 57 కి.మీ కొత్త రైలు మార్గం ఏర్పాటు చేసేందుకు గురువారం కేబినెట్ ఆమోదం తెలిపిందని తెలిపారు. రాజధాని అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలిచిపోయే ఈ ప్రాజెక్టును మంజూరు చేయించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్ట్‌లో భాగంగా కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెనను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ రైల్వే లైన్ హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, నాగ్‌పూర్‌తో సహా ప్రధాన నగరాలను కలుపుతుందని, తద్వారా రద్దీతోపాటు ఈ ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు వృద్ధి చెందనున్నాయని పేర్కొన్నారు. అమరావతి రాజధాని ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు గుంటూరు పార్లమెంట్ ప్రజలకు వరమని పేర్కొన్నారు.

డిసెంబర్ 15 లోపు పంటల బీమా చేయించుకునేలా చూడాలి

● వ్యవసాయ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం


వీడియా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

గుంటూరు సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతు లందరూ డిసెంబరు 15వ తేదీ లోపు పంటల బీమా నమోదు చేయించుకునేలా చూడాలని వ్యవసాయ శాఖాధి కారులను కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశించారు. రబీ 2024-25 పంటల బీమాలో రైతుల నమోదుపై జిల్లా కలెక్టర్లతో గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటల బీమాకు ప్రభు త్వం నిర్దేశించిన మార్గ దర్శకాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రబీ 2024-25 లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పంటల బీమాలో నూరు శాతం ఇష్టపూర్వకంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంటల బీమా నూతన మార్గదర్శ కాలపై, పంటల వారీగా ప్రీమియంలను, నమోదు అయ్యే విధానంపై ప్రచార పోస్టర్లు, వివిధ మాధ్యమాల ద్వారా క్షేత్ర స్థాయిలోని ఉద్యోగులు, సిబ్బంది తో విస్తృత స్థాయిలో రైతులందరికీ అవగాహన కల్పించేలా జిల్లా, డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అడిషనల్ డైరెక్టర్ బాలజీ నాయక్, సీపీఓ శేషశ్రీ, ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ పాల్గొన్నారు.

పశుగణనకు వచ్చేవారికి ప్రజలు సహకరించాలి

ఈ ఏడాది పశు సంవర్ధక రంగంలో భవిష్యత్ ప్రణాళికా ,విధాన రూపకల్పన కోసం నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణనకు గృహాలకు వచ్చిన విషయ సేకరణదారులకు అవసరమైన సమాచారాన్ని ఇచ్చి ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గురువారం పశుగణన ప్రచార పోస్టర్లను, స్టిక్కర్లను సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ తేజతో కలసి ఆమె ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా శుక్రవారం నుండి అఖిల భారత పశుగణన కార్యక్రమం జరగనుంది. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీఏ నర్సింహారావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ డా. కేవీవీ సత్యనారాయణ, అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ ఏ. నాగేశ్వరరావు, లైవ్ స్టాక్ సెన్ సెస్ నోడల్ అధికారి డా. కె శివయ్య పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

● ఎస్పీ సతీష్‌కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన కూడళ్లలో ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, పరిశోధనలో సీసీ కెమె రాలదే కీలక పాత్ర అని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల 24 గంటలు నిఘా ఉంటుందని అన్నారు. జిల్లాలో గతంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో నేరాలు జరుగుతున్న తీరు, నేరస్తులు నేరం చేసే విధానం అనేక విధాలుగా ఉంటున్నాయని అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జిల్లాలో సీసీ కెమెరాల వలన కలిగే ప్రయోజనాలు, వాటి ఆవశ్యకతను ప్రజలకు, వ్యాపారస్తులకు అవ గాహన కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఒంటరిగా ఉండే మహిళలు వారి ఇంటి పరిసరాలలో, రద్దీగా ఉండే వ్యాపార సముదాయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఓటుకు 1.25 లక్షల మంది
పట్టభద్రుల దరఖాస్తు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. ఈ నెల 23వ తేదీ సాయంత్రానికి లక్షా 25 వేల 59 మంది ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో గుంటూరు జిల్లా నుంచి అత్యధికంగా 29,887, ఎన్టీఆర్ జిల్లాలో 16,155, కృష్ణాలో 14,259, పల్నాడులో 14,715, బాపట్లలో 5,947, ఏలూరులో అత్యల్పంగా 2,997 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఓటరు నమోదు షెడ్యూల్ ప్రకారం రెండో రీ పబ్లికేషన్ ఈ నెల 25 విడుదల చేయనున్నారు. నవంబరు 6 వరకు దరఖాస్తులను స్వీకరించి 23న ముసాయిదా ఓటరు జాబితాలను ప్రచురిస్తారు. ఆ రోజు నుంచే క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించడం ప్రారంభిస్తారు. డిసెంబరు 9 వరకు స్వీకరించి వాటిని ఆ నెల 25వ తేదీలోపు పరిష్కరించి 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు.

ఎన్నికలు జరగలేదని..
ఝలక్

▼ స్థానిక సంస్థలకు నిలిచిన నిధులు
▼ తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం
▼ మూడు మున్సిపాల్టీలు, 69 పంచాయతీలకు ఆగిన నిధులు

(5వ పేజీ తరువాయి)

బాపట్లతో పాటు గుంటూరు జిల్లా పరిధిలోని పొన్నూరు మున్సిపాల్టీలకు ఈ ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఆయా మున్సిపాల్టీలలో పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని, అధికారం అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి రాజకీయ నేతలు తమకు అనుకూలంగా వార్డుల పునర్విభజన చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిని అధికారులు లక్ష్య పెట్టలేదు. దీంతో పలువురు కోర్టును ఆశ్రయించడంతో మున్సిపల్ ఎన్నికలు నిలిచిపోయాయి. నరసరావుపేట మున్సిపాలిటీలో 34 వార్డుల నుంచి 38 వార్డులకు పెంచే క్రమంలో ఇస్సపాలెం, లింగంగుంట్ల, యలమందల, రావిపాడు, కేశానుపల్లి పంచాయతీలను విలీనానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పొన్నూరు మున్సిపాల్టీలో 31 వార్డులను 36కు పెంచే క్రమంలో చింతలపూడి, కాసుకర్రు, కట్టెంపూడి, ఆలూరు, పెదఇటికంపాడు, వడ్డెముక్కల పంచాయతీలను విలీనం చేశారు. బాపట్ల మున్సిపాల్టీలో అడవి, అడవివారిపాలెం, ఈస్ట్‌బాపట్ల, కొండబొట్లవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, ముత్తాయపాలెం, పిన్నిబోయినవారిపాలెం, పోతురాజ కొత్తపాలెం, తూర్పు పిన్నబోయినవారిపాలెం, వెస్ట్ బాపట్ల పంచాయతీలను విలీనం చేశారు. మున్సిపాలిటీల్లో ఆయా పంచాయతీల విలీనం వల్ల నష్టం వాటిల్లుతుందని భావించిన కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఆయా పంచాయతీలతో పాటు మున్సిపాల్టీకి ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. చిలకలూరిపేట మున్సిపాల్టీలో విలీనమైన దండమూడి పంచాయతీకి ఎన్నికలు జరగలేదు. గుంటూరుకార్పొరేషన్, మంగళగిరి, తాడేపల్లి, క్యాపిటల్ సిటీలో విలీనం చేసిన పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు.

రూ.కోట్లలో నిలిచిన నిధులు

2022-23 ఆర్థిక సంవత్సరం మున్సిపాల్టీలకు ఆర్థిక సంఘం నిధులు సమకూరాయి. రెండో విడత కింద నరసరావుపేటకు రూ.3.79 కోట్లు, బాపట్లకి 3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీకి 1.96 కోట్లు నిధులు విడుదలయ్యాయి. మూడో విడత కూడా అదే స్థాయిలో నిధులు విడుదల కావాల్సి ఉంది. అయితే ఎన్నికలు జరగని కారణంగా నరసరావుపేట రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీకి 1.96 కోట్లు ఆగిపోయాయి. ఈ నిధులు సమకూరి ఉంటే ఆయా పట్టణాల్లో చాలావరకు రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించకపోవడం మున్సిపాల్టీల ఆర్థిక అవకాశాలను దెబ్బతీసింది.

చీరకట్టే ఫ్యాషన్



జీన్స్‌పై యువత అనాసక్తి

చీరకట్టు వైపు మొగ్గు

వేడుక ఏదైనా చీరతోనే అందం

ఇంట్లో శుభకార్యం, కాలేజీలో వీడ్కోలు పార్టీ స్నేహితురాలి పుట్టినరోజు.. ఇలా ఏ వేడుక ఉన్నా ఈతరం అమ్మాయిలు ముందుగా ఆలోచించేది, ఏ డ్రస్ వేసుకుంటే బాగుంటుంది అనే. అందుకు నేటి తరం యువతులు ఫ్యాషన్ దుస్తులపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జీన్స్, టీషర్ట్, లెగ్గిన్స్, జెగ్గిన్స్, లంగా ఓణీ, చుడీదార్ వంటి ఫ్యాషన్ డ్రెస్సులతో పాటు, నేటి యువతులు చీరకట్టు వైపు కూడా మక్కువ చూపుతున్నారు.

తెనాలి,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చీరకట్టుతో అందరినీ కట్టిపారేయాలనుకుంటున్నారు నేటి తరం అమ్మాయిలు. అయితే చీరకట్టులో అందంగా కనిపించాలంటే మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. లేని పక్షంలో ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. కొందరికి చీరకట్టుకోవాలన్న కోరిక బలంగా ఉంటుంది. అయితే చీర కట్టు మాత్రం వారికి అస్సలు నప్పదు. ఇలా కట్టుకుని ఇబ్బందులు పడేకంటే ఎవరికి ఎలాంటి చీర బాగా కనిపిస్తుందో తెలుసుకుని మరీ ట్రెండ్ ను ఫాలో అయితే బాగుంటుంది. అయితే చీర ఎంపిక చేసుకునేటప్పుడు శరీరాకృతి, రంగును దృష్టిలో పెట్టుకుంటే కనికట్టు చేయొచ్చు అంటున్నారు కొందరు ఫ్యాషన్ నిపుణులు.

ఎత్తు ఎక్కువగా ఉన్నవారు

ఎత్తుగా ఉన్న వాళ్లు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే చాలు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తారు. బ్రొకెట్ మెరుపులతో తీర్చిదిద్దినవి, హుందా పనితీరుతో రూపొందించిన సిల్క్, కాటన్, కాంజీవరం, టిష్యూ, ఎంబ్రాయిడరీ చీరలు కట్టుకుంటే చక్కగా కనిపిస్తారు. సింథటిక్ వస్త్రాలపై పెద్దపూలు, బొమ్మల ప్రింట్లు ఉన్నవి కట్టుకుంటే వీరికి బాగా నప్పుతాయి.

ఎత్తు తక్కువగా ఉన్నవారు..

ఎత్తు తక్కువగా ఉన్న యువతులు కూడా చీరలు కట్టుకోవడం అంటే మహా ఆనంద పడతారు. వాళ్లు మాత్రం అంచుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిజైన్స్ చిన్నవిగా ఉండి, అంచు సన్నగా ఉండే చీరలను ఎంపిక చేసుకోవాలి. దీంతో పాటు లేత రంగులో ఉండే చీరలను తీసుకుంటే మరింత అందంగా కనిపిస్తారు. ప్రస్తుతం మార్కెట్ లో గాగ్రాలాగా కుట్టి వేసుకోవడానికి సిద్ధంగా ఉన్న చీరలు మార్కెట్‌లో ఉన్నాయి. చీరకట్టుకోవడం రాని వాళ్లు, సమయం వృథా కాకుడదనుకు నే వారు మాత్రమే ఇలాంటి వాటిని ఎంచుకుంటున్నారు.

సన్నని నడుము ఉన్నవారు

కొందరు సన్నగా ఉన్నా నడుము భాగం, పొట్ట లావుగా ఉంటుంది. ఇలాంటి వారు చీరను మామూలుగా కట్టుకున్నా ఇంకా లావుగా కనిపించే ఆస్కారం ఉంటుంది. అలాంటప్పుడు చీరకు కుచ్చిళ్లు పోయకుండా గాగ్రా చోళీ తరహాలో కట్టుకుంటే వీరికి నప్పుతుంది. ఇలాంటి చిన్న చిన్న చిట్కాలు పాటించి మీరు చీరకట్టులో అందంగా కనిపించవచ్చని ఫ్యాషన్ నిపుణులు పేర్కొన్నారు.

ఫియర్ శరీరాకృతి ఉన్నవారు

వీరికి చీరలు మా బాగా నప్పుతాయి. చీరకట్టుకుంటే వీరు బాగా అందంగా కనిపిస్తారు. పియర్ శరీరాకృతిలో ఉన్న యువతులకు షిపాన్ చీరలు వారి అందాన్ని ద్విగుణీకృతం చేస్తాయి. వర్క్ ఎక్కువగా ఉండే సిల్క్, కాటన్ చీరలకు వీరు కాస్త దూరంగా ఉంటే మంచిది. చీరలపై వర్క్ విషయంలో చూస్తే చిన్న అద్దాలు, చమ్కీలు పొదిగినవి వీరికి బాగా నప్పుతాయని నిపుణులు పేర్కొన్నారు. అయితే వీరు కుచ్చిళ్ల అధికంగా ఉండేలా చూసుకోవాలి.





భుజాలు పెద్దవిగా ఉన్నవారు

కొందరి శరీరాకృతిలో భుజాలు పెద్దవిగా ఉంటాయి. ఇలాంటి వారు మాత్రం ధరించే బ్లౌజు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. మెడ బ్లౌజ్ భాగం చిన్నగా ఉండేలా కుట్టించుకోవాలి. చేతులు ఎంత తక్కువగా పెట్టించుకుంటే అంత మంచిది. పైట చెంగు కుచ్చిళ్ల వెడల్పు తక్కువ గా ఉండేలా చూసుకోవాలి. ఇవి పెద్దగా ఉంటే భుజాలు మరింత వెడల్పుగా కనిపిస్తాయి.

లావుగా ఉండేవారు

లావుగా ఉండే వాళ్లు చీరకట్టుకోవడానికి ఎక్కువగా ఇష్టపడరు. అయితే వీరు కాటన్ చీరల వైపు కన్నెత్తి చూడకూడదు. కాటన్ చీరలే కట్టుకోవాలంటే మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్యాబ్రిక్, నూలు కలగలసిన వాటికి ప్రాధాన్య మివ్వాలి. సన్నగా కనిపించాలంటే మాత్రం జార్జెట్, షిఫాన్, క్రేప్, ఇటాలియన్ వంటి వాటిని ఎంచుకుంటే మంచిది. పొట్ట ఎక్కువగా ఉన్నవారు పట్టుచీర కట్టుకునే సమయంలో కుచ్చిళ్ల తక్కువగా ఉండేలా చూసుకోవాలి.

విభజిత జిల్లాలకు..
నూతన డీఈవోలు

- గుంటూరుకు సీవీ రేణుక, పల్నాడుకు చంద్రకళ
- బాపట్ల డీఈవోగా ఎస్ పురుషోత్తం
- డైట్ ప్రిన్సిపల్ బదిలీ
- గుంటూరు ప్రస్తుత డీఈవో శైలజకు పోస్టింగ్ నిల్
- కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు

గుంటూరు(విద్య),అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) గుంటూరు విభజిత జిల్లాలకు కొత్త విద్యాశాఖ అధికారుల్ని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా డీఈవోగా కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీవీ రేణుకను నియమించారు. పల్నాడు డీఎస్ఈవోగా(జిల్లా పాఠశాలల విద్యాశాఖాధికారి) విశాఖగా డీఈవోగా పనిచేస్తున్న ఎల్ చంద్రకళను నియమించారు. ఈమెకు బోయపాలెంలోని డైట్ (జిల్లా శిక్షణా కేంద్రం)ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. అదే విధంగా మదనపల్లె డిప్యూటీ డీఈఈవోగా పనిచేస్తున్న ఎస్ పురుషోత్తం బాపట్ల డీఎస్ఈవోగాను బదిలీ చేశారు. డైట్ బోయపాలెం ప్రిన్సిపల్ సలీమ్ బాషాను కృష్ణాజిల్లా అంగలూరు డైట్ ప్రిన్సిపల్‌గా నియమించారు. డైట్ బోయపాలెంలో పనిచేస్తున్న సీనియర్ అధ్యాపకుడు అత్తోట కిరణ్‌కుమార్‌ను ప్రకాశం జిల్లా డీఈవోగా బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గుంటూరు ప్రస్తుత డీఈవోకు పోస్టింగ్ నిల్

గుంటూరు జిల్లాలో డీఈవోగా ఇప్పటి వరకు పనిచేసిన పి శైలజకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.దీనిపై ఉపాధ్యాయల వర్గాల్లో తీవ్ర చర్చసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా ఉమ్మడి జిల్లాలో ఎయిడెడ్ పోస్టుల భర్తీ విషయంలో భారీ ఆరోపణలు వచ్చాయి. పోస్టుల భర్తీ వివాదాస్పదం కావడంతోపాటు భారీ మొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. పది ఫలితాల్లో వెనుకబడి పోవడం, పాఠశాలల పర్యవేక్షణ తూతూ మంత్రంగా చేయడం, ఓ డిప్యూటీ డిఇవోపై భారీస్థాయిలో ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కలెక్టర్ బంగ్లాపక్కనే ఉన్న ఎంఈవో కార్యాలయంలో ఇద్దరు ఎంఈవోల మధ్యనెలకొన్న వివాదం చాంబర్‌కు తాళాలు వేసేస్థాయికి వెళ్లింది. పనుల కోసం వచ్చిన ఉపాధ్యాయులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినా పట్టించుకోకుండా ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఉపాధ్యాయ సంఘాల విషయంలో అనుసరించినవైఖరిపై వారిలో తీవ్ర అసహనం ఉంది. ఓ సామాజిక వర్గానికి కొమ్ముకాసే విధంగా ప్రవర్తించడం, విద్యాశాఖ నుంచి ఏ సమాచారం అడిగినా స్పందించక పోవడం వంటి అనేక కారణాలతో ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదని చెబుతున్నారు. మరోవైపు ఆమె పదోన్నతుల జాబితాలోఉన్నందున పోస్టింగ్ ఇవ్వలేదని విద్యాశాఖ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.



సీవీ రేణుక (గుంటూరు డీఈవో)



ఎల్ చంద్రకళ (డీఎస్ఈవో)పల్నాడు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య గంగాధరరావు



ఏఎన్‌యూలో ప్రారంభమైన యువజనోత్సవాలు

విద్యతో పాటు కళలపై కూడా ఆసక్తి పెంచుకోవాలి.

వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు

యువజనోత్సాహం

పెదకాకాని(ఏఎన్‌యూ), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా 2024-2025 యువజన ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యువజనోత్సవాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ ఆడిటోరియంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ విద్యతోపాటు అదనంగా క్రీడలు, కళారంగాలపై విద్యార్థులు దృష్టి సారించినట్లయితే పరిపూర్ణ జీవితాన్ని పొందగలుగుతారని పేర్కొన్నారు. కళారంగంలో ప్రతిభ ఉన్నవారికి అనేక రకాల విజయాలు సొంతమవుతాయని సూచించారు. వ్యక్తిగత రంగంతో పాటు సమష్టిగా రాణిస్తే ఆయా రంగాలలో విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అటువంటి విజయాలు సమాజాన్ని మేల్కొలిపేలా ఉంటాయని సూచించారు. ఈ యువజన ఉత్సవాల వేడుక విద్యార్థుల్లో దాగివున్న కళానైపుణ్యతను ప్రదర్శించేందుకు అవకాశం గా భావించి విద్యార్థులు ప్రదర్శనలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడుగా పాల్గొన్న థియేటర్, సినీ ఆర్టిస్టు, పారిశ్రామికవేత్త డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు మాట్లాడుతూ భావితరాలకు నేటి విద్యార్థులు పునాది రాళ్ల వంటి వారన్నారు. రేపటి జీవనరంగం నేటి యువతతో నిండివుందన్నారు. విద్యార్థులు ఒక స్పార్క్ మాదిరిగా వెలుగులు వెదజల్లాలని పిలుపునిచ్చారు. రెక్టార్ ఆచార్య కే రత్న షీలామణి మాట్లాడుతూ విద్యార్థులు మూడు రోజుల ఈ ఉత్సవాలలో సాంస్కృతిక, సాహిత్య, కళ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వేదికగా నిలుపుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ కళా నైపుణ్యంతో విద్యార్థులు ప్రదర్శన లు ఇవ్వాలన్నారు. యువజనోత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో 30 కళాశాల నుంచి విద్యార్థులు ఈ యువజన ఉత్సవాలలో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కోఆర్డినేటర్ ఆచార్య పి .జాన్సన్, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సిద్దయ్య, ఆచార్య ప్రమీలా రాణి, ఆచార్య ఎస్ వి కృష్ణారావు, ఆచార్య ధ నలక్ష్మి, ఆచార్య ఈ మాధవి, ఆచార్య త్రిమూర్తి రావు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటా పోటీగా పలు ప్రదర్శనలు.

మ్యూజిక్, థియేటర్ ఆర్ట్స్ పోటీలలో విద్యార్థులు పోటీపడి మరీ వారి ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్యంగా క్లాసికల్ డాన్స్‌లో అలనాటి మేటి చిత్రాల్లో ప్రముఖ నర్తకీమణులు నృత్యం చేసిన పాటలకు నేటి యువత అడుగులు వేయడం చూపరులను ఆకట్టుకుంది. తొలిరోజు గురువారం యువజన ఉత్సవాలలో భాగంగా క్లాసికల్ ఇనుస్ట్రుమెంటల్ సోలో, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్ట్రన్ లోకల్ సోలో, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్ లలో విద్యార్థులు మంచి ప్రదర్శనలు ఇచ్చారు. పోస్టర్ మేకింగ్, స్పాట్ పెయింటింగ్ లో విద్యార్థులు సృజనాత్మకతను వెలిబుచ్చారు. వికాస భవన్, విద్యార్థి కేంద్రం, దక్షిణామూర్తి సెమినార్ హాల్, బాలమోహన్ దాస్ సెమినార్ హాల్, ఓపెన్ ఎయిర్ థియేటర్ విభాగాలలో జరిగిన ఆయా పోటీలలో ఉత్సాహవంతమైన ప్రదర్శనలు ఇచ్చారని యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ తెలిపారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



బస్టాండ్‌లో జోనల్ ఈడీ తనిఖీలు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు గురువారం ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టాల్స్‌లో ధరల పట్టికలను పరిశీలించారు. ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరిపితే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బస్సుల రాకపోకల్లో సమయ పాలన పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం తిక్కన సమావేశ మందిరంలో గుంటూరు-1, 2, పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల మేనేజర్లతో సమీక్షించారు.కార్తీక మాసంలో భక్తులకు శైవక్షేత్రాలకు సకాలంలో బస్సులు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిభ చూపిన పలువురు డ్రైవర్లకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధి కారి ఎం రవికాంత్, డిపో మేనేజర్లు అబ్దుల్ సలాం, రామకృష్ణ తదితరులున్నారు.



సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఈడీవెంకటేశ్వరరావు

మిర్చియార్డులో మళ్లీ
విజిలెన్స్ తనిఖీలు

గేట్ ఎంట్రీ మొదలు ఎగ్జిట్ వరకు పరిశీలన

స్వయంగా రంగంలోకి ఎస్పీ.

సిబ్బందికి ముచ్చెమటలు

గుంటూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డులో మళ్లీ విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణకుమార్, సీఐలు కొమ్మాలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ తమ బృందంతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మిర్చియార్డుకు చేరుకుని పరిశీలించారు. యార్డులోకి మిర్చి టిక్కీల రాక మొదలు ట్రేడింగ్ ఎలా జరుగుతుంది, ఈనామ్‌లో బిడ్డింగ్, ట్రేడింగ్ తర్వాత సరుకు బయటకు ఎలా వెళుతుంది, విక్రయం కాని వాటిని కోల్డ్‌స్టోరేజ్‌లకు తరలించేటప్పుడు ఏ నిబంధనలు పాటిస్తారు వంటి వాటిని ప్రత్యేకంగా తెలుసుకున్నారు. ఈనామ్ బిడ్డింగ్ సెంటర్‌కు వెళ్లి ఎక్స్‌పోర్టర్లు ఏ విధంగా వేలంలో పాల్గొంటారనేది తనిఖీ చేశారు. బిడ్డింగ్ అయిపోయిన తర్వాత కమీషన్ వ్యాపారి దుకాణంలో మిర్చి టిక్కీలు కాటా వేయడాన్ని పరిశీలించారు. మిర్చి యార్డు ముఖద్వారం నుంచి సరుకు బయటకు వెళ్లేటప్పుడు రిజిష్టర్‌లో ఏ వివరాలు నమోదు చేస్తారని రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం చిలకలూరిపేట రోడ్డులో ఉన్న కోల్డ్‌స్టోరేజ్‌ను కూడా సందర్శించి అక్కడ మిర్చి టిక్కీలు ఎలా నిల్వ చేస్తారు, బాండ్లు ఎవరి పేర్లతో జారీ చేస్తారు, యార్డుకు రాకుండా కోల్డ్‌స్టోరేజ్‌లోనే జరిగే విక్రయాల గురించి ఆరా తీశారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు విజిలెన్స్ డైరెక్టర్ జనరల్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు నెలల క్రితం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి కొన్ని ఆధారాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికను సిద్ధం చేశారు. అప్పటి ఎస్పీ, సీఐలు, తహసీల్దారు బదిలీఅయి కొత్త అధికారులు వచ్చారు. ఆ ఫైలు గురించి అధ్యయనం చేసిన ప్రస్తుత అధికారులు క్షేత్రపరి శీలనకు గురువారం మిర్చియార్డుని సందర్శించారు. యార్డు ఇన్‌చార్జి శ్రీకాంత్ ద్వారా వివరాలు సేకరించారు. కమీషన్ ఏజెంట్ లైసెన్సుల గురించి తెలుసుకున్నారు. ఈనామ్‌లో తక్కువగా బిడ్డింగ్ జరుగుతుండంపై ఆరా తీశారు. విజిలెన్స్ అధికారులు ముందస్తుగానే యార్డు అధికారులకు తాము తనిఖీలకు వస్తున్నామని సమాచారం ఇచ్చారు. ఏ ఒక్కరూ బయట కు వెళ్లొద్దని చెప్పడంతో సిబ్బందికి ముచ్చెమటలు పట్టాయి.



మిర్చియార్డులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ, సీఐలు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నేడు దుగ్గిరాలలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం

దుగ్గిరాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు టీడీపీ గ్రామ నాయకులు తెలిపారు. గ్రామంలోని సెంట్రల్ వేర్‌హౌస్, జమ్మిచెట్టు సెంటర్, ఆలీనగర్, పెద్ద చర్చిల వద్ద ఏర్పాటు చేసిన శిబిరాల్లో ఏర్పాటు చేసిన ఓటు నమోదు ప్రక్రియను సద్వినియోగించుకోవాలని కోరారు.

ఏపీఎస్పీ పటాలంలో వైద్య శిబిరం

మంగళగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని బెటాలియన్ కమాండెంట్ కే.నగేష్‌బాబు ప్రారంభించారు. విజయవాడ రమేష్ హాస్పిటల్ నుంచి విచ్చేసిన వైద్య బృందం ఏపీఎస్పీ సిబ్బందికి, కుటుంబ సభ్యులకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ బి.ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్ కే వెంకటేశ్వర్లు, డీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం

పెదనందిపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం సీపీఎం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం నవంబరు 8 నుంచి 15 వరకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచారయాత్ర నిర్వహిస్తామన్నారు. దీనికి ప్రజలు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, దేవరకొండ శ్రీనివాసరావు, వెంకటశివరావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బారావు, యానాదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి

● ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

పెదనందిపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 10 విద్యార్థులపై ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు క్లాసులతో ఒత్తిడి పెంచుతున్నారని ఇది ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ ఎంఈవో ముద్దన శ్రీనివాసరావుకు గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సెలవు దినాల్లో కూడా క్లాసులు ఏర్పాటు చేసి రాత్రి 10గంటల వరకు అదనపు క్లాసులు ఏర్పాటు చేస్తున్నారని దీని వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని తక్షణమే ప్రభుత్వం పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ



విద్యార్థులకు చాకో మ్యాజిక్ బాక్సులను పంపిణీ చేస్తున్న కిరణ్‌చంద్ తదితరులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జాగృత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని పెదవడ్లపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎలిమెంటరీ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, ఉర్దూ పాఠశాలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులకు చాకో మ్యాజిక్ బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, ట్రస్టు అధ్యక్షుడు పసుపులేటి గణేష్, నాగార్జున హైస్కూల్ డైరెక్టర్ జొన్నలగడ్డ రాఘవయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివ రామయ్య, కొడవలి ఆనంద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇంటి సమీపంలో కొండచిలువ



చనిపోయి పడి ఉన్న కొండచిలువ

తాడేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి కరకట్ట వద్ద సీఎం చంద్రబాబు ఇంటి సమీపంలో పార్కింగ్ ప్రాంతం వద్ద చనిపోయి ఉన్న కొండచిలువను గురువారం భద్రతా సిబ్బంది గుర్తించారు. పారిశుధ్య సిబ్బందిని పిలిపించి, కొండచిలువ కళేబరాన్ని అక్కడి నుంచి తొలగించారు. కరకట్టకు సమీపంలో ఉన్న పొలాల్లోకి వచ్చిన కొండచిలువను గుర్తు తెలియని వ్యక్తులు చంపి ఇక్కడ పడేసి ఉంటారని భద్రతా సిబ్బంది భావిస్తున్నారు.

ఇంటింటికి స్టిక్కర్లు

ఫిరంగిపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గల ఇంటింటికి స్టిక్కర్లు అంటించనున్నామని మండల పశు వైద్యాధికారి షేక్ పీర్ అహమ్మద్ గురువారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు 21 అఖిల భారత పశుగణన కార్యక్రమం జరగనున్నదని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా పశు వైద్యాధికారి వాల్ స్టిక్కర్ల ఫిరంగిపురంలోని పశు వైద్యశాలలో సిబ్బందితో కలసి విడుదల చేశారు. ఈ పశుగణన కోసం ఎన్యూమ రేటర్లు, ఏహెచ్ఏలు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అంటించి పశుగణన చేసి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారని ఆయన తెలిపారు.

సమ్మెను ఉధృతం చేస్తాం

మంగళగిరి సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని సీపీఎం నేత వీసం జవహర్ హెచ్చరించారు. మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద క్లాప్ ఆటో డ్రైవర్లు చేస్తున్న సమ్మె శిబిరాన్ని రెండో రోజు ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కార్పొరేషన్ అధికారులు వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎస్ఎస్ చెంగయ్య, ఎం బాలాజీ, రవి, మణి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు ఏబీపాలెం జడ్పీ హైస్కూల్ భవనం

● పాఠశాలలో సమస్యల తిష్ఠ
● ఆరుబయటే విద్యాబోధన
● భయాందోళనలో విద్యార్థులు



శ్లాబు పెచ్చులూడి పడుతున్న ఏబీపాలెం జడ్పీ పాఠశాల భవనం



గడ్డి, ఖురదతో నిండిన పాఠశాల క్రీడా ప్రాంగణం

పెదనందిపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెం ఎంఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సమస్యలు తిష్ఠ వేశాయి. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పాఠశాలలో విద్యార్థులు ఇరుకు తరగతి గదుల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. ఎంతో పేరుప్రతిష్ఠ గల ఈ పాఠశాల సౌకర్యాలు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. ఎంఆర్ పాఠశాలను 1961లో ప్రారంభించారు. కాలక్రమేణ అది జిల్లా పరిషత్ పాఠశాలగా అభివృద్ధి చెంది 6 నుంచి 10 తరగతుల వరకు విద్యాబోధన అందిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల విలీనం పేరుతో 3, 4, 5 తరగతి విద్యార్థులను కూడా జడ్పీ పాఠశాలకు అనుసంధానం చేయడంతో విద్యార్థుల శాతం పెరిగింది. దీనికి సరిపడా తరగతి గదుల్లేక ఉన్న తరగతి గదులు పెచ్చులూడి పడడం, వర్షం కురవడం వంటి సమస్యలు తలెత్తడంతో తరగతి గదుల్లో విద్యనభ్యసించేందుకు విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన నిర్వహణకు అదనపు గది లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా ప్రాంగణంలో నీరు చేరి, పిచ్చి మొక్కలు మొలిచి అడవిని తలపిస్తుంది. ఆ మైదానాల్లో విద్యార్థులు ఆటలు ఆడేందుకు గానీ అటుగా వెళ్లాలన్నా విషసర్పాలు ఉంటాయేమోనని భయపడుతున్నారు. గతంలో ఈ పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి సైతం అనేక మంది వచ్చి విద్యనభ్యసిస్తుండేవారు. ఇక్కడ చదివిన ఎంతో మంది ఉన్నత స్థానాలకు ఎదగడమే కాకుండా ఇద్దరు ప్రజాప్రతినిధులు కూడా ఈ గ్రామం నుంచే ప్రాతినిధ్యం వహించారు. పాఠశాలలో సుమారు 120 మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు పూర్వపు విద్యార్థులతో పాటు దాతలు కూడా ముందుకు వచ్చి అనేక వసతులు కల్పించినప్పటికీ సరైన శాశ్వత బిల్డింగ్ లేకపోవడం కొసమెరుపు. గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు - నేడు ద్వారా అదనన పు తరగతులు నిర్మాణం, మరమ్మతులు చేపట్టి రూపురేఖలు మారుస్తామని చెప్పారు. కనీసం ఈ పాఠశాలలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. పాఠశాలలో నూతన భవన నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు పలుమార్లు వినతులు అందించినా పట్టించుకున్న నాథుడే లేడని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఈ ప్రాంతానికి ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు పాఠశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ అవి కేవలం మాటలు, కాగితాలకే పరిమితమయ్యాయని గ్రామస్థులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యకు ప్రాధాన్యమిస్తూ పాఠశాలల్లో మెరుగైన విద్య, వసతుల కల్పనే ధ్యేయంగా అడుగుల వేస్తుందని ఈ తరుణంలో ఈ పాఠశాల రూపు రేఖలు మారనున్నాయని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆశతో ఎదురు చూస్తున్నారు.



పాఠశాల వరండాలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం : హెచ్ఎం జగదీశ్‌రావు

పాఠశాలలో అదనపు తరగతులు నిర్మాణానికి ప్రతిపాదన తయారు చేశామని, విద్యాకమిటీ, గ్రామస్థుల సూచనల మేరకు 11 తరగతి గదులు, మధ్యాహ్న భోజన నిర్వాహణ గది, సైకిల్ స్టాండ్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి వసతుల కల్పనకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

ఎస్సీ బాలికల వసతి గృహంలో కోతుల దాడి

● గాయపడిన వారిని తెనాలికి తరలించిన వార్డెన్
● విద్యార్థినులకు టీడీపీ నాయకుల పరామర్శ



కోతుల దాడిలో గాయపడిన విద్యార్థినులను పరామర్శిస్తున్న టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, నాయకులు

దుగ్గిరాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని బాలికల వసతి గృహంలో విద్యార్థినులపై కోతులు చేసిన దాడిలో ఇద్దరు విద్యార్థినులు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో అల్పాహారం తీసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కోతుల దండు పరిసరాల్లో నిచెట్లపై నుంచి దూకి దాడి చేశాయి. హాస్టల్ వార్డెన్ నిర్మల దగ్గర ఉన్నప్పుడే దాడికి పాల్పడ్డాయి. వాటిని నిలువరించేందుకు ప్రయత్నించిన పదో తరగతి విద్యార్థిని ఈపూరు నందిని కాలిపై చేతిగోళ్లతో రక్కి, ఏడోతరగతి విద్యార్థిని దేశబోయిన శోభారాణిని కొరికి గాయపరిచాయి. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థినులు పరుగులు తీశారు. ఈలోగా తేరుకున్న వార్డెన్.. తహసీల్దార్ సునీతకు, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకటరవి, గాయపడిన విద్యార్థినులను 108 అంబులెన్స్‌లో ఎక్కించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో వివేకానంద, వీఆర్‌వోలు అనిల్, జయంత్‌లను వెంటబెట్టుకుని హాస్టల్‌కు చేరుకున్న తహసీల్దార్ సునీత, ఎస్ఐ వెంకటరవికుమార్, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. వార్డెన్, వాచ్‌మెన్‌లు అందుబాటులో ఉంటాన్నారా, ఏవైనా సమస్యలున్నాయా అంటూ ఆరా తీశారు. విద్యార్థినులు బసచేసే గదులకు, మరుగుదొడ్లకు కనీసం తలుపులు లేకపోవడాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాచ్‌మన్ కూడా అందుబాటులో ఉండటం లేదని విద్యార్థినులు సమస్యలను ఏకరవు పెట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్, పనిచేయని ట్యాప్‌లు తదితర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

పాఠశాలకు వెళ్లమని అంటున్న బాలికలు

తరచూ కోతులు దాడిచేయడం, హాస్టల్ సిబ్బంది అందుబాటులో లేకపోవడం, హాస్టల్ సమస్యలపై ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆందోళనతో విద్యార్థినులు కొందరు పాఠశాలకు వెళ్లకుండా ఉండిపోయారు. తహసీల్దార్ సునీత, ఎస్ఐ వెంకటరవిలు వారికి ధైర్యం చెప్పి పాఠశాలకు పంపారు.

గాయపడిన విద్యార్థినులకు పరామర్శ

బాలికల వసతిగృహంలో సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతామని గాయపడిన బాలికలను పరామర్శించేందుకు వచ్చిన మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆమె విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి తాళ్ల అశోక్, యువత అధ్యక్షుడు దేవరపల్లి చంటి, కేసంనేని వాసుబాబు, పులివర్తి రాజరత్నం తదితరులు విద్యార్థినులను పరామర్శించి అధికారులతో మాట్లాడారు. అనంతరం ఏఎస్‌డబ్ల్యూ రామారావు, ఎంపీడీవోతో మాట్లాడారు. మండలపరిషత్ నిధులతో అత్యవసరమైన మరమ్మతులను చేయిస్తామని ఎంపీడీవో తెలిపారు.

రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అమరావతిలో 9 కేంద్రాలు

● ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్



రైతుకు ప్లాట్ల కేటాయింపు పత్రం అందజేస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్

తుళ్లూరు, అక్టోబరు 24: (ఆంధ్రజ్యోతి) రాజధాని ప్రాంత అభివృద్ధికి భూములు ఇచ్చి ప్లాట్లు పొందిన రైతుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. భూములిచ్చిన రైతులకు సీఆర్డీఏ కార్యాలయంలో ఈ- లాటరీ కార్యక్రమాన్ని రెండో రోజు గురువారం నిర్వహించారు. ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పొందిన రైతులు వారం లోపు రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని ఆయన తెలిపారు. ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో రైతులకు తెలియజేసేందుకు ప్రత్యేకంగా గ్రామ సర్వేయర్లను నియమించినట్లు తెలిపారు. 9 గ్రామాలకు చెందిన 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.డేవిడ్‌రాజు, జి.భీమారావు, కె.స్వర్ణమేరి, జి.శ్రీనివాసనాయక్, తహసీల్దార్ అరుణాదేవి పాల్గొన్నారు.

అరెకరం పొలం అమ్మి.. అమరావతికి రూ.13.5 లక్షల విరాళం

● దాతృత్వం చాటుకున్న వైద్య విద్యార్థిని వైష్ణవి
● గతంలోనూ ఎకరం అమ్మి 25లక్షలు అందజేత



సీఎం చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న వైష్ణవి, మనోజ్

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిగా అమరావతి నిర్మాణం పూర్తి కావాలని, అభివృద్ధి జరగాలని వైద్య విద్యార్థిని వైష్ణవి ఆకాంక్షించారు. అందుకే అరెకరం పొలం అమ్మి మరీ రూ.13.50 లక్షలు అమరావతికి విరాళంగా ఇచ్చారు. ఏలూరు జిల్లా ముదినేపల్లికి చెందిన ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ అంబుల మనోజ్ కుమార్తె వైష్ణవి వైద్య విద్యార్థిని. చిన్ననాటి నుంచే సేవా భావం అలవాటైన ఆమె.. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అమరావతిలో రాష్ట్ర సచివాలయం, హైకోర్టు భవనాల నిర్మాణాలకు విరాళం అందజేశారు. దీనికోసం ఆమె అరెకరం పొలం అమ్మి రూ.12.50 లక్షలు, మరికొంత బంగారం అమ్మి రూ.లక్ష.. కలిపి మొత్తం 13.50 లక్షలు ఇచ్చారు. తండ్రి మనోజ్ సహకారంతో భూమి అమ్మి మరీ రాజధాని నిర్మాణానికి విరాళం ఇవ్వడంపై సీఎం చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వైష్ణవిని, మనోజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కాగా, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా వైష్ణవి ఎకరం పొలం అమ్మి రూ.25 లక్షలు, బంగారు గాజులు అమ్మి రూ.లక్ష, పోలవరం ప్రాజెక్టుకు మరో రూ.లక్ష అందజేశారు. అప్పట్లో ఆమెను అభినందిస్తూ సీఎం చంద్రబాబు వైష్ణవిని అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. 2018లోనూ వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం డాక్టర్ మనోజ్, వైష్ణవి మరో రూ.5లక్షలు అందజేశారు.

కేఎల్‌యూ విద్యార్థికి మిస్టర్ ఇండియా అవార్డు



నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న వరుణ్ చౌదరి (ఫైల్)

తాడేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కంప్యూ టర్ సైన్స్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న కొత్తపల్లి వరుణ్ చౌదరి మిస్టర్ ఇండియా పురస్కారానికి ఎంపికయినట్లు వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ నెల 19, 20 తేదీలలో అస్సాంలోని గౌహతిలో జరిగిన మిస్టర్ నార్త్, ఈస్ట్ ఇండియా పోటీలలో పాల్గొన్న వరుణ్ చౌదరి అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయ రన్నరప్ బహుమతిని గెలుచుకున్నాడని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆయా కళాశాలలు, విద్యాసంస్థలతోపాటు పలు రంగాలకు చెందిన అనేకమంది విరివిగా పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ నుంచి పోటీలలో పాల్గొన్న కొత్తపల్లి వరుణ్ చౌదరి అవార్డు సాధించడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో రాయల్ మిస్టర్ ఇండియా టైటిల్‌ను కూడా సొంతం చేసుకున్న వరుణ్ చౌదరి రానున్న కాలంలో మరిన్ని అవార్డులు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మిస్టర్ ఇండియా అవార్డును సాధించి వరుణ్ చౌదరిని వర్సిటీ వీసీ డాక్టర్ జి పార్థసారధివర్మ, ప్రోవీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు అభినందించారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు

తాడికొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పొన్నెకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ట్యూబెక్టమీ ఆపరేషన్‌ను పరిశీలించి పర్యవేక్షించారు. వ్యాక్సిన్ నిల్వలను ఏవిధంగా చేస్తున్నారో పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే లాంలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలును పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యూబెక్టమీ ఆపరేషన్లు పీహెచ్‌సీ పరిధిలో చేస్తున్నట్లు తెలిపారు. రోగులు వినియోగించుకోవాలని సూచించారు. బీసీజీ వ్యాక్సినేషన్ అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వీవీ శైలజా, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మలినేని విద్యార్థులకు బహుమతులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ ఏఐ అండ్ డీఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు లాంలోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో టెక్ నిర్వహణ 2024లో బహుమతులు కైవసం చేసుకున్నారు. ఏఐ అండ్ డీఎస్ విద్యార్థినులు బీ బిందు, యూ మంజరి, జెడ్ ఫాతిమ, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో మహేశ్వరి ప్రథమ, టెక్ క్విజ్ పోటీల్లో వై కీర్తి, ఎస్‌కే ఆస్మా షరీన, పీ మహేశ్వరిలు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను మలినేని విద్యాసంస్థల చైర్మన్ పెరుమాళ్ళు, సీఎస్ఈ హెడ్ రామస్వామి, ఏఐడీఎస్ హెడ్ చార్లెస్ జయరావులు విద్యార్థులను అభినందించారు.

చలపతిలో ఘనంగా టెక్‌ఫెస్ట్



పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న చలపతి కళాశాల ప్రిన్సిపాల్

తాడికొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్-2024లో భాగంగా టెక్ నిర్వహణా అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కోడ్ క్రాస్ట్ ఛాలెంజ్, ఇన్నోవేషన్ షోకేజ్, మైండ్ బైట్స్, టెక్నో స్ట్రోమ్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. వివిధ కళా శాలల నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలియజేశారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయటానికి, సాంకేతిక నైపుణ్యాలను పరీక్షించుకోవడం, అభివృద్ధి చేసుకోవటానికి టెక్‌ఫెస్ట్‌ను నిర్వహించామన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి ఏ బాలాజీ, కళాశాల డీన్ అకాడమిక్స్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఆర్ఎం విద్యార్థినికి రూ.50 వేల చెక్కులను అందజేస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, జనార్ధన్‌రెడ్డి

ఎస్ఆర్ఎం విద్యార్థులకు సీఎం చంద్రబాబు ప్రశంసలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్, కేంద్ర పౌర విమానయాన శాఖలు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి డ్రోన్ సమ్మిట్‌లో ఎస్ఆర్ఎం విద్యార్థులు ప్రదర్శించిన డ్రోన్ టెక్నాలజీ వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మల్టీ స్పెక్ట్రల్ ఇమేజింగ్, మెషిన్ లెర్నింగ్, డ్రోన్ టెక్నాలజీలను అనుసంధానం చేసి సరస్సులు, నదుల్లోని నీటి నాణ్యతను గుర్తించి శాస్త్ర సాంకేతికతను విద్యార్థులు రూపొందించి సమ్మిట్‌లో ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు వివరాలను స్వయంగా తెలుసుకున్న సీఎం చంద్రబాబు విద్యార్థులు నిత్య, సుమయ అఫ్రీన్, హితేశ్వరరాజులను ప్రత్యేకంగా అభినందించారు. రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ ప్రదర్శనకు ఎస్ఆర్ఎం సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్లు ప్రణవ్ పెద్దింటి, హరీష్ మెంటార్లుగా వ్యవహరించారు. విద్యార్థి బృందాన్ని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ మనోజ్ కుమార్ అరోరా, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి రవితేజ అభినందించారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మంత్రి నారా లోకేశ్



మంత్రి లోకేశ్‌తో చిల్లపల్లి

మంగళగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రభుత్వాస్పత్రిని వంద పడకల సమగ్ర ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తూ ఏపీ కేబినెట్ తీర్మానించడంపై జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని అనతి కాలంలోనే నెరవేర్చిన మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. పేదలు అధికంగా ఉన్న మంగళగిరి ప్రాంతంలో వంద పడకల ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేస్తే ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని చిల్లపల్లి తెలిపారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే 80శాతం పూర్తి

● దుగ్గిరాల ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు



దుగ్గిరాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో 80 శాతం స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు తెలిపారు. ఆయన గురువారం పలు అంశాలపై ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఫటాఫట్.

ఫటా ఫట్

స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే పురోగతి ఎలా ఉంది?

ఎంపీడీవో: మండలంలో 15 నుంచి 59ఏళ్ల లోపువారికి ఉపాధి, ఉద్యోగ కల్పనకై స్కిల్ డెవ లప్‌మెంట్ సర్వే చేపడుతున్నాం. ఇప్పటికే 80 శాతం పూర్తయింది. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద మంగళగిరి నియోజకవర్గాన్ని తీసుకున్నారు. నైపుణ్యతపై శిక్షణ ద్వారా ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా సర్వే కొనసాగుతోంది.

పల్లెపండుగ ఎన్ని గ్రామాల్లో చేపట్టారు?

ఎంపీడీవో: మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించాం.

ఏఏ అభివృద్ధి పనులకు ఎంత మేరకు నిధులు కేటాయించారు?

ఎంపీడీవో: మొత్తం 36 పనులకు భూమిపూజ నిర్వహించాం. జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.3కోట్ల 36లక్షలతో చేపడుతున్నాం. ప్రధానంగా రైతులకు ఉపకరించే 20 డొంకరోడ్లకు శంకుస్థాపన చేశాం. అత్యవసరమైన కల్వర్టులు, కొన్ని గ్రామాల్లో అంతర్గత సీసీరోడ్లకు భూమిపూజ చేశాం.

ఎప్పటికి పూర్తి చేయాలనేది లక్ష్యం?

ఎంపీడీవో: భూమిపూజ చేసిన పనులన్నింటినీ రానున్న మూడునెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాం

27 నుంచి దశావతార వెంకన్న స్వామి పవిత్రోత్సవాలు



దశావతార వేంకటేశ్వర స్వామి దేవస్థానం (ఇన్‌సెట్లో స్వామివారు)

పెదకాకాని, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుటి గల దశావతార వెంకటన్న సన్నిధిలో ఈనెల 27 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు రోజులపాటు స్వామివారి పవిత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులందరికీ ఇదే ప్రత్యేక ఆహ్వానంగా భావించి స్వామివారిని దర్శించి, పవిత్రోత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు. 27న పవిత్రోత్సవాలకు అంకురార్పణం చేస్తామని, 28న నవగ్రహ యజ్ఞం జరుగుతుందన్నారు. 29న అష్టోత్తర కలశాభిషేకం 108 వెండి కలశములతో అభిషేకము, అనంతరం గర్భ ఆలయంలో స్వామివారికి పవిత్ర ధారణ అలంకరణ జరుగుతుందన్నారు. 30 తేదీన శ్రీదేవి భూదేవి సమేత దశావతార వెంకటేశ్వర స్వామి వారికి శాంతి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. భక్తులంతా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని లింగమనేని పూర్ణచంద్రరావు దంపతులు పిలుపునిచ్చారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

కొల్లిపర పరిధిలో విద్యుత్ నిలిపివేత: ఏఈ ప్రదీప్‌కుమార్

కొల్లిపర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గుదిబండివారిపాలెం, చింపారెడ్డిపాలెం, కొల్లిపర మెయిన్‌రోడ్డులో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

27 నుంచి దశావతార వెంకన్నస్వామి పవిత్రోత్సవాలు

● భారీగా ఏర్పాట్లు

పెదకాకాని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుటి ఉన్న దశావతార వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 27 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు రోజులపాటు స్వామి వారి పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులందరూ ఈ పవిత్రోత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు. 27న పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 28న నవగ్రహ యజ్ఞం, 29న అష్టోత్తర కలశాభిషేకం 108 వెండి కలశాలతో అభిషేకం, అనంతరం గర్భాలయంలో స్వామివారికి పవిత్రధారణ అలంకరణ జరుగుతుందన్నారు. 30వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత దశావతార వెంకటేశ్వరస్వామి వారికి శాంతి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

మతోన్మాద రాజకీయాలకు బుద్ధి చెప్పండి: శంకర్

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాద రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఐఎంఎల్ పొలిట్‌బ్యూరో సభ్యుడు, కామ్రేడ్ శంకర్ పేర్కొన్నారు. చినరావూరు కమ్యూనిటీ హాలులో గురువారం ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎంపీ రామ్‌దేవ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఏపీలో కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు చాపకింద నీరులా చేరే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇందుకు టీడీపీ, జనసేనలు సహకరిస్తున్నాయని, దేవాలయ వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం ఉండకూడదనే జీవో జారీ చేయడం ఇందుకు ఉదహారణగా చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్న జగన్ కేసుల భయంతో గత ఐదేళ్లు ఏమి చేయలేకపోయారని, ఇప్పుడు కూడా మాట్లాడే పరిస్థితి లేదన్నారు. ప్రజా పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సూపర్‌సిక్స్ వాగ్దానాలపై ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. పీపుల్స్-6 పేరుతో డిసెంబరు 4న విజయవాడలో జరిగే ప్రజాహక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. బంగార్రావు, కోటేశ్వరరావు, ఉదయకిరణ్, బెన్‌హర్, వెంకటేష్ ప్రసంగించారు.

నేడు నియోజకవర్గ టీడీపీ సర్వసభ్య సమావేశం

తెనాలి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజవర్గ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేట ఎన్వీఆర్ కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలుచేయాలి: చందు

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకంను వెంటనే అమలు చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు కోరారు. తెనాలి బస్‌స్టేషన్‌లో గురువారం బస్సుఎక్కి కొంత దూరం ప్రయాణించి ఈ పథకం అమలుపై మహిళలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా ఉచిత బస్సు పథకం కూడా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఈ పథకంపై ఎలాంటి కార్యాచరణ ప్రకటించకపోవడంపై మహిళల్లో అసంతృప్తి నెలకొని ఉందన్నారు. రహదారులను బాగు చేయాలని కూడా ప్రయాణికులు కోరుతున్నారని చెప్పారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు పొన్నూరు శశిధర్, శివరామకృష్ణ ప్రసాద్, బుల్లియ్య, శివన్నారాయణ, శివకుమార్ పాల్గొన్నారు.

'పేదలకు రెండు ఎకరాల సాగుభూమి ఇవ్వాలి'

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు రెండు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు కోరారు. కార్మిక సంఘం జిల్లా సమావేశం ఈ నెల 27న దుగ్గిరాల కళ్యాణ మండపంలో జరుగుతుందని తెలిపారు. తెనాలి సీపీఐ కార్యాలయంలో గురువారం కరపత్రాలు విడుదల చేశారు. కనపర్తి బెన్‌హర్, కోటేశ్వరి, జానీ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ పోస్టర్ ఆవిష్కరణ

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్ సినిమా పోస్టర్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా గురువారం సచివాలయంలో ఆయనను కలిసి పోస్టర్ విడుదల చేయించినట్లు తెలిపారు. చిత్ర సన్నివేశాలను పూర్తి చేయడానికి మరో ఆరు మాసాలు సమయం పడుతుందని చెప్పారు. ఆనాటి పరిస్థితులకు అనుగుణమైన సెట్టింగ్‌లు రూపొందించి చిత్రీకరిస్తామన్నారు. నవంబరు 9నుంచి బయోపిక్ తదుపరి షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభం అవుతుందన్నారు. జలియన్‌వాలా బాగ్ ఉదాంతాన్ని కూడా చిత్రీకరిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మిలటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనుల జీవితాల్లో..

వెలుగులేవి..?

● ముడిసరుకుకు కూడా ఇబ్బందులు తప్పడంలేదు
● వర్షం వస్తే బట్టీ నడవదు
● చేసిన వస్తువులు భద్రతపరిచే సౌకర్యం కరువే
● కుటుంబమంతా కష్టపడినా ఆదాయం అంతంతే
● ప్రభుత్వ సాయం కోసం కార్మికుల ఎదురుచూపులు
● ఉత్పత్తులు దళారులపాలు



మట్టితో ప్రమిదలు తయారుచేస్తున్న చేతి వృత్తిదారుడు



గోడౌన్‌లు లేక ఇంట్లో ఆరబోసిన ప్రమిదలు

తెనాలి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ పేరు చెప్పగానే అందరికీ టక్కున గుర్తుకు వచ్చేది మట్టి ప్రమిదల్లో వెలిగించే దీపాలు. అమావాస్య చీకట్లను పారద్రోలి దీపాల కాంతులతో ఆ ఇంట వెలుగులు నింపుతాయి. దీపారాధన చేసే ప్రమిదలు తయారు చేసే శాలివాహనుల జీవితాల్లో మాత్రం వెలుగులు లేక కులవృత్తిగా తరతరాల నుంచి వచ్చిన మట్టి ఆకృతుల తయారీని విడిచిపెట్టలేక శాలివాహన కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఉదయం నాలుగు గంటలకు నిద్రలేచి కుటుంబమంతా శ్రమిస్తే కనీసం కూలి కూడా గిట్టుబాటు కాని పరిస్థితుల్లో మట్టి కార్మికులు పరిస్థితి దిగజారిందని వారు వాపోతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చేతి వృత్తిదారులకు కనీస ప్రోత్సాహం కూడా లేదని ఆవేదన చెందుతున్నారు. తెనాలి మండలం కొలకలూరులో శాలివాహనుల కుటుంబాలు దాదాపుగా 50కి పైగా ఉన్నాయి. వీరందరూ వంశపారంపర్యంగా వచ్చిన కులవృత్తి అయిన మట్టి ఆకృతులు తయారు చేస్తూ వాటితో వచ్చే అరకొర సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే మట్టి ఆకృతులు తయారుచేసేందుకు అవసరమైన ముడిసరుకు ధరలు పెరిగి తగినంత దొరక్క తమవృత్తి కొనసాగించే పరిస్థితి నానాటికీ భారంగా మారుతుందని తల్లడిల్లుతున్నారు. ఇటీవల కొలకలూరు శివారుల్లో అనమర్లపూడి, చేబ్రోలు మండలం శలపాడు వంటి గ్రామాల్లో బంకమట్టి విరివిగా లభించేది. అయితే గత కొంత కాలంగా మట్టి దొరకడం కష్టంగా మారింది. ఇటీవల ట్రక్కు మట్టి రూ.2000 ఉండగా ప్రస్తుతం దాని ధర కూడా రూ.5000వరకూ చేరింది. దీనికి తోడు గ్రామంలో చేతివృత్తికి వాడే మట్టిని సైతం మైనింగ్ అంటూ అధికారులు వాటికి చలానాలు విధించడంతో మట్టి దిగుమతి తమకు భారంగా మారిందని కార్మికులు వాపోతున్నారు.

రోజూ శ్రమిస్తేనే సీజన్లో అందించగలుగుతాం

ఉదయం నాలుగు గంటలకు కుటుంబంలో అందరం మేలుకుంటేనే వేసవిలో కుండలు, దీపావళి సీజన్లో ప్రమిదలు వంటివి అందించగలుగుతామని చెబుతున్నారు. అయితే మట్టితో వాటిని తయారు చేయడం అంత సులువుకాదు. ఉదయాన్నే ఇంట్లో మహిళలు, పిల్లలు మట్టిని మొత్తగా నలుగగొట్టి వాటిని ఒక తొట్టిలో నానబెట్టి, మట్టిని ముద్దలుగా తీసుకుని ఇంట్లో మగవారు తొక్కుతూ బంకముద్దగా తయారు చేస్తారు. అనంతరం సారె (చక్రం)సాయంతో తిప్పుతూ మట్టి ముద్దను ఉంచి కార్మికులు తమ చేతులతో రకరకాల ఆకృతులతో ప్రమిదలు, కుండలు, కూజాలు, ముంతలు, ప్లేట్లు, ఆహారం వండుకునేందుకు పాత్రలు ఇలా అన్ని రకాల డిజైన్లలో తయారు చేస్తారు. అనంతరం పచ్చిగా ఉన్న వాటిని ఎండలో ఎండబెట్టి సాయంత్రం ఊక, కట్టెలు పేర్చి వాటిని బట్టిలో వేసి కాలుస్తారు. కాల్చిన మట్టి ఉత్పత్తులను తీసి వాటికి పాలిష్ పట్టి ఆరబెట్టి విక్రయించాల్సి ఉంటుంది. ఇదంతా చేయడానికి దాదాపుగా 10 రోజుల వరకూ సమయం పడుతుంది.

వర్షం వస్తే నీటిపాలే

మట్టి ఉత్పత్తులు తయారుచేసి ఆరబెట్టే సమయంలో వర్షం కురిస్తే అవి నానిపోయి చివరకు మట్టికూడా గంగపాలవుతుందని కార్మికులు చెబుతున్నారు. తమకు చేతినిండా పని దొరికిందనుకున్న సమయానికి అకాల వర్షాలు కురుస్తూ తమ జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమకు వర్షం పడినప్పుడు ఇబ్బందులు లేకుండా ఉత్పత్తులను ఆర బెట్టుకునేందుకు అవసరమైనషెడ్లు, పచ్చివి కాల్చేందుకు బట్టికి షెడ్డు, స్టోర్ చేసుకునేందుకు అవసరమైన గౌడౌన్‌లు వంటివి కల్పిస్తే తమకు మంచి జరుగుతుందని చెబుతున్నారు.

శ్రమకు తగ్గ ఫలితమేది..?



చేతివృత్తి కార్మికురాలు తిరుపతమ్మ

మట్టి కొనుగోలు చేసి కుటుంబమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకూ శ్రమిస్తే ప్రమిదకు మిగిలేది రూ.50పైసలు మాత్రమేనని చేతివృత్తి కార్మికురాలు రాజవరపు తిరుపతమ్మ చెబుతున్నారు. తమ వద్ద హోల్‌సేల్‌గా కొనుగోలు చేసే వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయించుకుంటూ వారు ధనవంతులుగా ఎదుగుతున్నారని మట్టి పిసికి ఉత్పత్తులు తయారుచేసే తాము మాత్రం కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. తమకు ప్రభుత్వం సొంతంగా ఉత్పత్తులు అమ్ముకునేలా మార్కెట్‌లను ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

ఎస్సీ బాలికల వసతి గృహంలో కోతుల దాడి

● గాయపడిన వారిని తెనాలికి తరలించిన వార్డెన్
● విద్యార్థినులకు టీడీపీ నాయకుల పరామర్శ

దుగ్గిరాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల లోని బాలికల వసతి గృహంలో విద్యార్థినులపై కోతు లు చేసిన దాడిలో ఇద్దరు విద్యార్థినులు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. గురువారం ఉదయం 7.30 గం టల సమయంలో అల్పాహారం తీసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కోతుల దండు పరిసరాల్లో ని చెట్లపై నుంచి దూకి దాడిచేశాయి. హాస్టల్ వార్డెన్ నిర్మల దగ్గర ఉన్నప్పుడే దాడికి పాల్పడ్డాయి. వాటిని నిలువరించేందుకు ప్రయత్నించిన పదో తరగతి విద్యార్థిని ఈపూరు నందిని కాలిపై చేతిగోళ్లతో రక్కి, ఏడో తరగతి విద్యార్థిని దేశబోయిన శోభారాణిని కొరికి గాయపరిచాయి. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థినులు పరుగులు తీశారు. ఈలోగా తేరుకున్న వార్డెన్.. తహసీల్దార్ సునీతకు, స్థానిక పోలీస్‌స్టేషన్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకటరవి, గాయపడిన విద్యార్థినులను 108 అంబులెన్స్‌లో ఎక్కించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో వివేకా నంద, వీఆర్‌వోలు అనిల్, జయంత్‌లను వెంబెట్టుకుని హాస్టల్‌కు చేరుకున్న తహసీల్దార్ సునీత, ఎస్ఐ వెంకటరవికుమార్, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. వార్డెన్, వాచ్‌మెన్‌లు అందుబాటులో ఉంటున్నా రా, ఏమైనా సమస్యలున్నాయా అంటూ ఆరా తీశారు. విద్యార్థినులు బసచేసే గదులకు, మరుగుదొడ్లకు కనీ సం తలుపులు లేకపోవడాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాచ్‌మన్ కూడా అందుబాటులో ఉండటం లేదని విద్యార్థినులు సమస్యలను ఏకరవు పెట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్, పనిచేయని ట్యాప్‌లు తదితర సమస్య లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న కేసంనేని శ్రీఅనిత

గాయపడిన విద్యార్థినులకు పరామర్శ

బాలికల వసతిగృహంలో సమస్యలను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతామని గాయపడిన బాలికలను పరామర్శించేందుకు వచ్చిన టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆమె విద్యార్థినులకు ధైర్యం చెప్పారు.


ఆరోపణల పై దేవదాయశాఖ డీసీ విచారణ



విచారణ నిర్వహిస్తున్న దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

పొన్నూరు టౌన్, అక్టోబరు 24: పొన్నూరు పట్టణంలోని సుందరవల్లీ రాజ్యలక్ష్మీత సమేత భావనారాయణ స్వామి ఆలయంలో పూజారులపై వచ్చిన ఆరోపణలపై విచారణ ప్రారంభం అయింది. గురువారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ఆలయంలో కొందరు పూజారులు మహిళ భక్తులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అలాగే భక్తులతో అమర్యాదగా ప్రవర్తించడంతో పాటు పలు అంశాలపై విచారణ జరిపారు. ఆలయంలో కొందరు అర్చకులు వంశపారపర్యంగా వచ్చే అర్చకత్వం అర్హత లేకపోయినా అర్చకులుగా కొనసాగుతున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. వంశపారపర్యంగా అర్చకత్వం చేసేవారు దేవదాయశాఖ ఈనాం భూములు అప్పగించకుండా వాటిని విక్రయించుకోవడంతో పాటు ప్రభుత్వ స్కేలు వేతనాలు పొందుతున్నారని ఫిర్యాదులు అందాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి చందాలు వసూలు చేశారని, నిధుల వినియోగంపై అవకతవకలు జరిగాయని పట్టణానికి కొందరు భక్తులు దేవదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై డీసీ శ్రీనివాసరావు విచారణ జరిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపామని నివేదిక రూపొందించి ఉన్నతాదికారుల ఆదేశాలమేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని డీసీ శ్రీనివాసరావు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్‌ను గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. టోర్నమెంట్ కార్యదర్శి ఉదయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, మంత్రిని కలిసి పోటీల వివరాలు వివరించారు. అండర్-14 స్కూల్ గేమ్స్‌ను ఈ నెల 26 నుంచి చెంచుపేట డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. 500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి కమిటీని కోరారు. కోచ్ నాగరాజు, పీడీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

26న తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 26న తెనాలిలో ప్రారంభమవుతాయని కమిటీ కన్వీనర్ ఈదర పూర్ణచంద్ తెలిపారు. 4వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ 2వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్, మినీ సబ్ జూనియర్, క్యాడెట్ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని చెప్పారు. పోటీల పోస్టర్లను గురువారం విడుదల చేశారు. లక్ష్మీనరసింహా సోమయాజి వైశ్య వ్యాయామ మందిర్‌లో జరిగే పోటీల్లో పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈదర శ్రీనివాసరావు, కోచ్‌లు రోహిత్‌వర్మ, కె.శ్రీనివాసరావు, చంటి, బాలు తదితరులు పాల్గొన్నారు.

27న రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవర పరిచయ వేదికను ఈ నెల 27న ఆదివారం తెనాలిలో నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు తురిమెళ్ల దక్షిణామూర్తి తెలిపారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, నూకల రామ కోటేశ్వరరావు కళ్యాణ మండపంలో నిర్వహించే వేదికలో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని శాఖల బ్రాహ్మణ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెనాలి సుందరీకరణకు సహకరించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ సుందరీకరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. స్థానిక కొత్తపేట 7వ వార్డులో గురువారం పురపాలక సంఘ కమిషనర్ శేషన్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మురుగునీటి పారుదలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు ఇంటి పరిసరాల పరిశుభ్రతతో పాటు వార్డు పరిసరాల పరిశుభ్రతను పాటించి, అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. ప్రజలు మూడు బుట్టల విధానాన్ని పాటించాలని కోరారు. వ్యర్థాలను, చెత్తను మురుగు కాలువలలో వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

వీవీఐటీలో అమేయా 2కే24 సాంకేతిక సదస్సు

పెదకాకాని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్, స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో అక్టోబరు 24, 25 తారీకులలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయస్థాయి సాంకేతిక సదస్సు అమేయా 2కే24 సాంకేతిక వేడుకలను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఎండీ అండ్ సీఈవో, కస్టమ్స్ అండ్ జీఎస్‌టీ కమిషనర్ ఎమ్.రమణారెడ్డి, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఎమ్‌వీ చారిలు గురువారం ప్రారంభించారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సులో టెక్ హంట్, పోస్టర్ ప్రజెంటేషన్ యాడ్స్, కాంపొనెంట్ క్లాష్ వంటి సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 1100మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్. రమణా రెడ్డి మాట్లడుతూ పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ కె.గిరిబాబు, డైరెక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి టి.శ్రీనివాసరావు సంధానకర్త వి.కిరణ్ కుమార్,సేమ్ విద్యార్థి విభాగం సభ్యులు జి. సాయిగణేష్, ఏ. సిద్ధార్థ విద్యార్థులు పాల్గొన్నారు.



సహన కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సంఘ ప్రతినిధులు

సహన హత్య ఘటనపై చర్యలు తీసుకోవాలి: మాల్యాద్రి

తెనాలి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ చేతిలో మోసపోయి, హత్యకు గురైన మదిర సహన కుటుంబానికి తగిన న్యాయం చేయాలని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్రా మాల్యాద్రి కోరారు. పట్టణంలోని ఐతానగర్ హయ్యర్‌పేటలో సహన కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. నిర్భయ చట్టాన్ని అమలు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలని కోరారు. కొల్లిపర బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, జోనేష్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక చర్యలు

● మండల వైద్యాధికారి లక్ష్మీసుధ





కొల్లిపర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజన్ వ్యాధులు విజృంభిస్తున్నాయని వాటిని తగ్గించటానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ పేర్కొన్నారు. ఆమెతో గురువారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పలు అంశాలపై ఫటాఫట్..

గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయ్ కారణం ఏమిటి ?

వైద్యాధికారి: వాతావరణంలో వచ్చిన మార్పులతో పాటు భూగర్భ జలాలు కలుషితం అవ్వటంతో ప్రజలు జ్వరాల భారీన పడుతున్నారు.

సీజనల్ వ్యాధులపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు ?

వైద్యాధికారి: గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వేచేసి జ్వరాలు ఉన్నవారిని గుర్తించి వారికి తగిన వైద్యం అందిస్తున్నాం.

గ్రామాల్లో డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు ఉన్నాయా?

వైద్యాధికారి: కొల్లిపర మండలంలో మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర గ్రామాల్లో డెంగీ, టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. ఆ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల సహకారంతో పారిశుద్యం చర్యలు, యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చేశాం.

రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయా ?

వైద్యాధికారి: రోగులకు కావాల్సిన అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాం. బీపీ, షుగర్, మలేరియా, టైఫాయిడ్, పాము, కుక్కకాటుకు, క్షయ, కుష్టువ్యాధికి సంబంధిన మందులూ అందుబాటులో ఉన్నాయ్.

ఉప్పలపాడులో చోరీ



పెదకాకాని, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పలపాడులో చోరీ జరిగింది. ఉప్పలపాడుకు చెందిన ద్రోణాదుల మల్లేశ్వరి అనే వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. అదే గ్రామంలో ఉన్న తన కుమార్తె రమణమ్మ ఇంటికి బుధవారం రాత్రి వెళ్ళి అక్కడ ఉండి, గురువారం ఉదయం ఇంటికి వచ్చే చూడగా తలుపులు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.50 వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహిళ అదృశ్యంపై కేసు



రాజ్యలక్ష్మి (ఫైల్ ఫొటో)

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ ఏఎస్ఐ హైదర్ ఆలి గురువారం తెలిపారు. ఏఎస్ఐ కథనం ప్రకారం బాలాజీ రావుపేటకు చెందిన పెనుమూడి రాజ్యలక్ష్మి ఈ నెల 21వ తేదీన ఇంటినుంచి బయటకువెళ్లి తిరిగి రాలేదు. భర్త ఆమె కుటుంబ సభ్యులు, బంధువులను, విచారించినా ఆచూకీ లభించలేదన్నారు. దీంతో ఆమె భర్త బసవశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ ఏఎస్ఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన మహేశ్వరరెడ్డి

కొల్లిపర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని చివలూరులో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొల్లిపర మండలం తూములూరు గ్రామానికి చెందిన వింతా మహేశ్వరరెడ్డి (43) నందివెలుగు రైసిమిల్‌లో నాలుగు సంవత్సరాల నుంచి పని చేస్తున్నాడు. మహేశ్వరరెడ్డి నందివెలుగు నుంచి తూములూరు ద్విచక్రవాహనంపై రాత్రి సమయంలో వస్తూ చివలూరు సమీపంలో రోడ్డుపై ఉన్న కంకరగుట్టను ఢీకొన్నాడు. బైక్ అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కోటేశ్వరరావు కేసు నమోదుచేశారు. మహేశ్వరరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.



నిడుబ్రోలులో గృహాల మధ్య నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు తదితరులు

గృహాల మధ్య మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు

● కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, అక్టోబరు 24: గృహాల మధ్య మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. గురువారం పట్టణంలోని నిడుబ్రోలు పలు వార్డుల్లో కమిషనర్ రమేష్‌బాబు పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లోని గృహాల మధ్య వర్షపునీరు రోజుల తరబడి నిల్వ ఉండి మురుగునీరుగా మారిందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నిల్వ నీటిలో దోమలు వృద్ధిచెంది ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. తక్షణమే మురుగునీరు బయటకు మళ్లించే చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. పలు ప్రాంతాలలో సరఫరా అవుతున్న రక్షిత తాగునీటి నాణ్యతను పరీక్షించారు. సురక్షిత నీరు ప్రతి గృహానికి అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిడుబ్రోలు డంపింగ్ యార్డును సందర్శించి యార్డులోని తడిచెత్త, పొడిచెత్త సెగ్రిగేషన్ చేసే యూనిట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు యార్డులో చెత్త వ్యర్థాలు రహదారి పైకి రాకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.



గోపి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, ఇన్‌సెట్‌లో గోపి ఫైల్ ఫొటో

గోపి మృతి పార్టీకి తీరని లోటు: ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని గ్రామం రజకపాలెంనకు చెందిన తెలుగు యువత నాయకులు తేరటి గోపి (34) మరణించడం పార్టీకి తీరనిలోటు అని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తెలిపారు. గురువారం గోపి మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించాలి

● జిల్లా అడిషినల్ డీపీఎం సత్యనారాయణ

కొల్లిపర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషినల్ డీపీఎం సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర ఆరిమండవారి కల్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయ కేడర్స్‌కు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడటం వలన రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన నాణ్యమైన ఉత్పత్తులు సాధించటానికి అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు తెగుళ్ల బారినపడే అవకాశం ఉండదన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని తెలియజేశారు. సదస్సులో ప్రకృతి వ్యవసాయ ఎంటీఎల్ మాధవి, మాస్టర్ ట్రైనర్ పాండురంగారావు, యూనిట్ ఇన్‌చార్జీ బేతాళ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.